నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | సెప్టెంబర్ 05 2023 | www.navatelangana.com

ఎలక్షన్ కమిషన్(ఢిల్లీ) బందం పర్యటన



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఇద్దరు సభ్యుల బందం సోమవారం పటాన్‌చెరు పారిశ్రామికాడలో పర్యటించింది. సందర్భంగా రాజేష్ కుమార్ సింగ్, సందీప్ కుమార్‌ల ప్రతినిధుల బందం మండలంలోని రుద్రారం, రామచంద్రపురం మండలంలోని తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ లో గల పోలింగ్ బూతులతో పాటు, ఆర్డబ్ల్యూఏ వారితో సమావేశం అయ్యారు. మండలంలోని గీతం యూనివర్సిటీలో ఎస్ హెచ్ జి గ్రూప్ లతో సమావేశం తో పాటు ఫోటో ఎగ్జిబిషన్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ నమోదు కార్యక్రమం తో పాటు డిఎల్ఓస్ పనితీరుపై ఆరా తీశారు. అలాగే గ్రామాల జనాభాకు అనుగుణంగా ఓటర్స్ ఉన్నారా.. 18 ఏండ్లు నిండినవారు ఓటర్ నమోదు పై ఆసక్తి తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతుండడంపై సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి, ఆర్ఓ దేవ్ జా, ప్రత్యేక అధికారి మహిపాల్ రెడ్డి, తహసిల్దార్లు భాస్కర్, సంగ్రామ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు లబ్ధిదారుల అభ్యున్నతికి సోపానాలు

- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల అభ్యున్నతికి కృషి చేస్తాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే ఓడితల సతీష్ కుమార్ అన్నారు.సోమవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామానికి చెందిన యాస శ్రీనివాస్ అనే లబ్ధిదారునికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చిన కారును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా 8 లక్షల యూనిట్ కు రూ. 4,80,000 కార్పొరేషన్ అందించగా రూ.3,20,000 బ్యాంకు రుణం అందిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. అబ్ధిదారులు సంక్షేమ పథకాలు అందుకొని సంపద సృష్టించుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

జిల్లా ఉత్తమ టీచర్లకు శుభాకాంక్షలు



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండలం కేంద్రంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సోమవారం మాట్లాడుతూ జగదేవపూర్ మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన ఎం.డి రహీం ప్రధానోపాధ్యాయులు మునిగడప, శివప్రసాద్ తెలంగాణ మోడల్ స్కూల్, నాగార్జునసాగర్ తెలంగాణ మోడల్ స్కూల్, సమత ఎంపీపీఎస్ తీగుల్ నర్సాపూర్, అంకం వెంకటేశ్వర్లు ఎంపీపీఎస్ లింగారెడ్డిపల్లి గారలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో జగదేవపూర్ మండలం పేరును ఉత్తమంగా నిలిపారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మీరంతా మంచి స్ఫూర్తితో, అంకితభావంతో ఉద్యోగ సేవలు అందిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఆయన వెంట సంఘము నాయకులు ఉన్నారు.

విమార్ట్ అధినేత విశ్వం మరణం



నవ తెలంగాణ- దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 11 వ వార్డుకు చెందిన ప్రముఖ వ్యాపార దిగ్గజం, వి-మార్ట్ సూపర్ మార్కెట్ సంస్థల అధినేత తడకమడ్ల విశ్వం గుప్తా(56) అనారోగ్యంతో సోమవారం మరణించారు. రిటైల్ ,హెూల్ సేల్ కిరాణా షాప్ ను నడిపిస్తూ మండల వ్యాప్తంగా పేరొందిన ఆయన రైస్ మిల్లులు నెలకొల్పి, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారు. చివరగా వి -మార్ట్ పేరుతో సూపర్ మార్కెట్లను సిద్దిపేట,గజ్వేల్ పట్టణాల్లో నెలకొల్పి ఎంతోమంది నిరుద్యోగులకు ప్రత్యక్ష,పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించారు.గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తుదిశ్వాస విడిచారని ఆయన కుటుంబీకులు, లచ్చపేట వార్డు ప్రజలు తెలిపారు. వ్యాపారవేత్త విశ్వం అకాల మరణం పట్ల మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సంతాపం తెలిపారు.విశ్వం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ఎల్కతుర్తి మండలంలోని వల్లభపురం గ్రామంలో జరిగే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సెప్టెంబర్ 6న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు 7 వ తేదీ ఊరు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సభ్యులు సదా నిరంజన్ సిద్ధాంతి శివ, రాకేష్, వెంకట్ , సుమన్ , ఆదిత్య, క్షేత్ర తదితర సభ్యులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ- అక్కన్నపేట

అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో సర్పంచ్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా గ్రామ దేవత పోచమ్మ తల్లికి బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, అక్కన్నపేట ఎంపీపీ లక్ష్మీ బీలు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుఖంగా ఉండాలని అన్నారు. ఎమ్మెల్యే సతీష్ కుమార్ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి కావాలని గ్రామ దేవతను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గోపాల్పూర్‌ను పంచాయతీ చేయండి



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిదిలోని మునిగడప గ్రామ పంచాయితీ మధిర గ్రామం అయిన గోపాల్పూర్ గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం గ్రామ ప్రజలు రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక మరియు వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దూరంగా గ్రామ పంచాయతీ ఉండడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయి అంటూ గ్రామస్తులు ఆయనతో ఆవేదన చెందారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్ ,వార్డు సభ్యులు చందు, మరియు గోపాల్పూర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కారణంగా నిరాహార దీక్ష వాయిదా

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నేడు 5న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు.చేర్యాల మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ తిరిగి ఈనెల 11న దీక్షలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

వినియోగదారుల సంఘ సంయుక్త కార్యదర్శిగా రాజమల్లయ్య



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య సంయుక్త కార్యదర్శిగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన బూట్ల రాజ మల్లయ్య ఎన్నికయ్యారు. గత నెల ఆగష్టు 27న హైదరాబాద్ చాపల్రోడ్ లోని ఇంజనీర్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన క్యాట్కో సర్వసభ్య సమావేశంలో 2023- 25 సంవత్సరానికి నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కరీంనగర్ రీజియన్ నుండి (కరీంనగర్ ,సిద్దిపేట, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలు) క్యాట్కో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజమల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాజమల్లయ్య తెలిపారు.

కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



నవ తెలంగాణ - దౌల్తాబాద్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని దుబ్బాక శాసనసభ్యులు మాధవనేని రఘునందన్ రావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో ఉన్న సదుపాయాల గురించి ఆరా తీసారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల గురించి జిల్లా విద్యాధికారికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బ అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ ముత్యం గారి యాదగిరి, కోనేపల్లి సర్పంచ్ సురేందర్ రెడ్డి, బిజెపి అధ్యక్షులు పోతరాజుకిషన్, యాదగిరి పాల్గొన్నారు.

గజగజ వణుకుతున్న గ్రౌండ్



- ఏ ప్రభుత్వ కార్యాలయం, భవనం మంజూరైనా..
- పాలకులు, అధికారుల చూపు కాలేజ్ గ్రౌండ్ వైపు
- ప్రతిసారి అడ్డుకుంటున్న స్థానిక క్రీడాకారులు
- ఖాళీగా ఉన్న ఎస్టీ హాస్టల్‌లో రామాయంపేట ఆర్డీవో ఆఫీస్?
- పార్కింగ్ స్థలంగా మారనున్న కాలేజీ గ్రౌండ్?
- పార్కింగ్‌కు రామాయంపేట గ్రౌండ్‌ను ఉపయోగిస్తే ఉద్యమం: క్రీడాకారులు



నవతెలంగాణ - రామాయంపేట

రామాయంపేట పట్టణంలో ఏ ప్రభుత్వ కార్యాలయం, ఏ ప్రభుత్వ భవనం మంజూరైన పాపం రామాయంపేట కాలేజ్ గ్రౌండ్ గజగజ వణుకుతోంది. 25 ఏళ్ల క్రితం సుమారు నాలుగు ఎకరాలతో విశాలంగా ఉన్న రామాయంపేట కాలేజ్ గ్రౌండ్, ప్రస్తుతం రెండు ఎకరాల లోపు కుదించుకుపోయింది. క్రీడల ప్రారంభోత్సవాలకు, బహుమతుల ప్రదానోత్సవాలకు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, క్రీడలు.. ఆరోగ్యంగా ఉండడానికి, మానసిక ఉల్లాసానికి, దేహదారుడ్యానికి ఎంతో ఉపయోగపడతాయని, క్రీడల అభివృద్ధికి క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కృషి చేస్తామని ఉపన్యాసాలు ఇస్తారు. ఆచరణలో మాత్రం క్రీడల అభివృద్ధికి కృషి చేయడం అటుంచి, క్రీడల కోసం ఉన్న గ్రౌండ్ లను మాత్రం ఎందుకు పనికి రాకుండా చేస్తున్నారు.

రెండు ఎకరాలకు తగ్గిన మైదానం

రామాయంపేట పట్టణం మధ్యలో గాంధీ విగ్రహం వద్ద ఉన్న పోలీస్ స్టేషన్ అప్పట్లో నక్సలైట్లు పేల్చి వేశారు. సుమారు ఎకరాలతో సువిశాలంగా ఉన్న రామాయంపేట కాలేజీ గ్రౌండ్‌లో సుమారు ఎకరన్న స్థలాన్ని పోలీస్ స్టేషన్ కోసం కేటాయించారు. అక్కడ పోలీస్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం చేపట్టారు. సుమారు12 ఏళ్ల క్రితం గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం పాడవడంతో, నూతన భవనం మంజూరు అయింది. పాడైన భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించకుండా, గ్రౌండ్ స్థలాన్ని కొంత కలుపుకొని నూతన భవనాన్ని నిర్మించారు. అప్పుడు స్థానిక క్రీడాకారులు వ్యతిరేకించిన పట్టించుకోకుండా భవన నిర్మాణం పూర్తి చేశారు. సుమారు ఏడేళ్ల క్రితం రామాయంపేట జూనియర్ కళాశాల భవనం మంజూరు అయింది. గ్రౌండ్ లో చాలావరకు కలుపుకొని కళాశాల భవన నిర్మాణం కోసం పనులు చేపట్టారు. స్థానిక క్రీడాకారులు నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవడంతో.. కొంత భాగం కలుపుకొని భవనాన్ని నిర్మాణం పూర్తి చేశారు. గతంలో సుమారుగా నాలుగు ఎకరాలు ఉన్న కళాశాల మైదానం ప్రస్తుతం రెండు ఎకరాల లోపు కు తగ్గిపోయింది.

నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం అడ్డుకున్న క్రీడాకారులు

ఏడాది క్రితం రామయంపేట పట్టణానికి వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కోసం నిధులు మంజూరయ్యాయి. పాలకులు, అధికారుల చూపు కాలేజ్ గ్రౌండ్ వైపు మళ్లింది. ఈసారి ఏకంగా కాలేజ్ గ్రౌండ్ లో సగభాగాన్ని కలుపుకొని, ప్రస్తుత పోలీస్ స్టేషన్, ఆర్ అండ్ వి భవనస్థలం మొత్తం లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక క్రీడాకారులు ఆందోళన బాట పట్టారు. ఇంత పెద్ద మున్సిపాలిటీలో ఉన్న ఏకైక ఈ చిన్న మైదానాన్ని కూడా ఇతర భవనాల కోసం ఉపయోగిస్తే క్రీడలకు ఇబ్బందులు ఎదురవుతాయని వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆందోళనలకు కార్యాచరణ రూపొందించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కాలేజీ గ్రౌండ్ లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని ఆపివేసి, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించాల్సిందిగా ఆదేశించారు.

ఆర్డీవో కార్యాలయం పార్కింగ్ ప్లేస్‌గా మారనుందా?

రామాయంపేట ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలతో.. చేస్తున్న డిమాండ్ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించారు. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడిందని ఓవైపు సంతోషిస్తుండగా, తిరిగి అధికారుల చూపు కాలేజీ గ్రౌండ్ వైపు మళ్లింది. సమీకృత వసతి గృహ నిర్మాణంతో.. కాలేజీ గ్రౌండ్ కు అనుకొని ఉన్న ఎస్టీ హాస్టల్ ఖాళీగా మారింది. ఖాళీగా ఉన్న ఎస్టీ హాస్టల్ లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని శనివారం మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ తో పాటు తహసిల్దార్ ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పరిశీలించారు. ఒకవేళ ఎస్టీ హాస్టల్లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేస్తే కాలేజీ గ్రౌండ్ ఆర్డీవో కార్యాలయ పార్కింగ్ స్థలంగా మారనుంది. ఎందుకంటే ఎస్టీ హాస్టల్ గేటు నేరుగా కాలేజీ గ్రౌండ్ కు ఆనుకొని ఉంది.

ఆర్డీవో కార్యాలయానికి వెనుక నుంచి దారి చేస్తాం: మున్సిపల్ చైర్మన్

ఖాళీగా ఉన్న రామాయంపేట ఎస్టి హాస్టల్లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు కోసం శనివారం మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ తో పాటు పలువురు అధికారులు పరిశీలించారు. స్థానిక క్రీడాకారులు అక్కడికి చేరుకొని వ్యతిరేకత వ్యక్తం చేశారు. కార్యాలయం కు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసిన తర్వాతనే ఆర్డిఓ ఆఫీస్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. దీంతో హాస్టల్ వెనుకవైపు నుండి పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ ఆర్డీవో కార్యాలయం కు వెనుక వైపు నుండి దారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అన్ని స్కూళ్లు, కాలేజీలకు కలిపి ఉన్నది ఒకటే గ్రౌండ్

రామాయంపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, ఇంటర్ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు, ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు.. ఏ ఒక్క దానికి కూడా క్రీడా మైదానాలు లేవు. రామయంపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చే వేలాది విద్యార్థులకు, స్థానిక క్రీడాకారులకు, క్రికెట్ పోటీలకు, ఫుట్బాల్, వాలీబాల్, హాకీ పోటీలకు ఉన్నది ఒకటే గ్రౌండ్. అలాగే పోలీస్ ట్రైనింగ్ కోసం వందలాదిమంది అభ్యర్థులు ప్రాక్టీస్ కి ఎన్నో సంవత్సరాలుగా కాలేజీ గ్రౌండ్ సేవలందిస్తుంది.

పార్కింగ్‌కు గ్రౌండ్‌ను ఉపయోగిస్తే ఉద్యమం: క్రీడాకారులు

ఎస్టి హాస్టల్‌లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేసి, పార్కింగ్ కోసం కాలేజీ గ్రౌండ్ ఉపయోగిస్తే ఉద్యమ బాట పడతామని క్రీడాకారులు బొంతల సత్యం తో పాటు పలువురు హెచ్చరించారు. క్రీడలకు న్యాయం చేస్తామంటూ, కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేస్తామంటూ పాలకులు ఇలా గ్రౌండ్ ను ఎందుకు పనికి రాకుండా చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ, ఇతర స్థలాలలో ఆర్డీవో కార్యాలయం కోసం నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని, అప్పటివరకు అవసరం అయితే వెనక వైపు నుండి దారి ఏర్పాటు చేయాలని వారు సూచించారు. పార్కింగ్ కు స్థలాన్ని ఏర్పాటు చేయకుండా, ఎస్టి హాస్టల్లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

'ట్రేడెంట్' పరిశ్రమ.. చెరకు రైతుల గుండెకాయ

- కంపెనీ ప్రయివేటీకరణ ఆపాలి
- కొత్తూరు ఫ్యాక్టరీని కేసీఆర్ ఫ్యాక్టరీ నామకరణం చేస్తాం
- ప్రభుత్వం నుంచి స్పందన వచ్చేవరకు 72 గంటల పాటు సామూహిక ప్రార్థనలు
- ఢిల్లీ వసంత్ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రికి వినతి



నవతెలంగాణ-జహీరాబాద్

ట్రిడెంట్ చక్కర పరిశ్రమ ఈ జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులకు గుండెకాయ లాంటిదని.. అలాంటి కర్మాగారాన్ని ప్రయివేటు పరం చేసే కుట్ర జరుగుతోందని.. అలా కాకుండా పరిశ్రమను ప్రభుత్వ పరం చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జాతీయ రైతునేత ఢిల్లీ వసంత్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని షెట్కర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఢిల్లీ వసంత్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి.. 'మట్టి మనుషుల మనోగతం- భూమిపుత్రుల ఆకలి కేక' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. గత వారం రోజుల నుంచి జహీరాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న సుమారు 150 గ్రామాల నుంచి మట్టిని సేకరించి.. సభపై ప్లకార్డులతో కుర్చిలపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తూరు గ్రామంలో ఉన్న చక్కెర పరిశ్రమ ఈ ప్రాంత చెరకు రైతులకు గుండెకాయ లాంటిదన్నారు. ఈ పరిశ్రమ పరిధిలో జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాలలోని కొన్ని వేల మంది చిన్న సన్నకారు మధ్యతరగతి చెరుకు రైతులు ఉన్నారని.. వారందరి కుటుంబాలు దీనిపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. అలాంటి పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఒకవేళ ప్రైవేటీకరణ జరిగితే ఈ ప్రాంత రైతులు తమ అస్తిత్వాన్ని కోల్పోవాల్సి వస్తుందని.. అందుకే నేడు రైతుల అస్తిత్వాన్ని సభపై ఉంచి దానిని కాపాడే విధంగా కార్యక్రమానికి పూనుకోవడం జరిగిందన్నారు. తాను తెలంగాణ ఉద్యమం సమయంలో ఒక ఉద్యమకారుడుగా, రైతుల ఆత్మహత్యలపై ఢిల్లీ వరకు నడిచి జాతీయస్థాయిలో ఒక విధానపరమైన లోపాలపై రాజకీయ పార్టీలతో చర్చించడం జరిగిందన్నారు. అప్పటి యూపీఏ ప్రభుత్వం రూ. 71 వేల కోట్ల రుణమాఫీ పథకం ప్రకటించి నప్పటికీ అది ఒక కంటి తుడుపు చర్యగా మిగిలిపోయిందన్నారు. స్థానికంగా ఉన్న జహీరాబాద్ చక్కర పరిశ్రమ రైతుల దశాబ్దాల ఘోష ఇంకా కొనసాగుతూనే ఉందని, తమ చెక్కర కర్మాగారాన్ని తామే నడుపుకొనుటకు ప్రభుత్వ సహకారాన్ని కోరుతున్నామన్నారు. అందుకోసం జహీరాబాద్‌కు ప్రకటించిన 1100 మంది దళితబంధు లబ్దిదారులను షేర్ హెూల్డర్లుగా మార్చి ఆ డబ్బుతో కర్మాగారాన్ని జహీరా బాద్ ప్రజలు సొంతం చేసుకొని దళితుల అభివద్ధికి ఉపయోగపడే ఒక మార్గాన్ని ముఖ్యమంత్రి ముందు ఉంచుతున్నామన్నారు. ఈ విషయాన్ని వెంటనే సహదయంతో అమలు చేసి దేశంలోని అన్ని రాష్ట్రాల గర్వపడేలా దళిత బంధు పథకానికి ఒక గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి ని ఒక భగవంతుడిగా భావిస్తూ 72 గంటల పాటు ఇదే ఫంక్షన్ హాల్ లో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, రైతు నాయకులు మాధవరెడ్డి, బందం సభ్యులు మైపాల్, పాపయ్య,శ్రీనివాస్, అశోక్ పాటిల్, స్టీవెన్సన్, తదితరులు పాల్గొన్నారు.

ధరణిలో అసైన్డ్ రైతుల పేర్లను వెంటనే ఎక్కించాలి

- పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

ధరణిలో అసైన్డ్ రైతుల పేర్లను వెంటనే ఎక్కించాలని, అలాగే పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి నగేష్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. జిల్లాలో అనేక గ్రామాల్లో ధరణిలో అసైన్డ్ రైతుల పేర్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల పేర్లను వెంటనే ధరణిలో ఎక్కించాలని డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆ సమయంలో పట్టాలిచ్చిన భూమిలో గత కొన్నేండ్లుగా పేదలు సాగు చేస్తున్నారన్నారు. అలాంటిది వారికి ఇప్పటి వరకూ కొత్త పట్టా పాస్ పుస్తకాలను ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూప్రక్షాళన పేరుతో వారి పేర్లను నిలిపివేయండంతో.. వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరణిలో పేరు లేకపోవడం వలన రైతుబంధు, రైతు బీమా, ఇతర ప్రభుత్వ పథకాలు రావటం లేదన్నారు. సాగులో ఉన్న రైతులను ప్రభుత్వ అధికారులు వెంటనే గుర్తించి.. గతంలో ఇచ్చిన భూములను ఆన్లైన్లో నమోదు చేసిన్యాయం చేయాలన్నారు. పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాపాస్ పుస్తకాలు వచ్చే వరకు అందరూ ఐక్యత ఉండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.యాదవరెడ్డి, నాయకులు రాజయ్యమల్లారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్లకు రాయితీలు

- పేదలపై జీఎస్టీ, పన్నుల భారం
- నిత్యావసరాల ధరల్ని తగ్గించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా





నవతెలంగాణ- దుబ్బాక

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి పేదలపై నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్, గ్యాస్, పెట్రోల్, డీజిల్, జీఎస్టీ వంటి అనేక రూపాల్లో పన్నులు వసూలు చేస్తూ కార్పొరేట్లకు మాత్రం రుణమాఫీలు, రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.భాస్కర్ మండిపడ్డారు. ధరలను నియంత్రించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇష్టారీతిలో పెంచుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలపై అధిక భారాన్ని మోపుతోందని విమర్శించారు. నిత్యావసరాల ధరల్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం ఉప తహశీల్దార్ సందీప్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు.ఈ సమస్యల్ని పక్కదారి పట్టించేందుకే ప్రజల మధ్య కుల,మత వైశమ్యాలను సృష్టిస్తుందని దుయ్యబట్టారు.కేంద్రంలోని మోదీ సర్కార్ జీఎస్టీ పేరుతో ప్రతి వస్తువుపై పన్నులు విధిస్తూ ప్రజల నుండి అనేక టాక్సీలను వసూలు చేస్తుందని ఇలా వసూలు చేసిన సొమ్మును కార్పొరేట్ ధనవంతులకు లక్షల కోట్లల్లో రుణాలు మాఫీ చేస్తూ, రాయితీలు కల్పిస్తుందని ఆరోపించారు. ఇకనైనా నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎం) నాయకులు ఎండి.సాజిద్, బత్తుల రాజు, మల్లేశం, శంకర్, అల్లావుద్దీన్, నర్సింలు, నగేష్, యాదగిరి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి

నవ తెలంగాణ కొండపాక

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూటికి 90 శాతంగా ఉన్న పేద మధ్యతరగతి ప్రజలపై అనేక భారాలు మోపుతోందని, ఉన్నత వర్గాలై కార్పొరేట్ బడా భూస్వాములకు దేశ సంపదను కొల్లగొట్టే విధంగా వ్యవహరిస్తున్నదని, ఈ చర్యలు వెంటనే మానుకొని నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని సీపీఐ(ఎం) కొండపాక మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. వెలికట్ట గ్రామలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మోడీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ పెంచిన ధరలను తగ్గించాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని, విద్యా, వైద్యాన్ని ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందించాలని, బిజెపి నరేంద్ర మోడీ పాలనలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని ఉపాధి లేక ప్రజలు అల్లాడుతున్నారని ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా కుట్రలు పన్నుతున్నారని ప్రభుత్వ రంగ సేవలను, ప్రభుత్వంగా ఆస్తులను కార్పోరేట్లకు కట్టబెట్టుతున్నారని మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను వెంటనే మానుకొని నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేసే రకంగా చర్యలు తీసుకోవాలని,ఉపాధి హామి కూలీలకు 200 రోజులు పని కల్పించి దినసరి కూలీ రూ. 600 కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పేద మధ్యతరగతి ప్రజలను, కార్మికులను రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొమురవెల్లి కనకయ్య తాటోజు రవీంద్ర చారి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బర్మ కొమురయ్య సిపిఎం నాయకులు రోడ్డ బెల్లమయ్య అమ్ముల యాదయ్య పెరుగు యాదయ్య శివ రాజయ్య భూమయ్య కనకయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగితే సహించేది లేదు

- ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం
- పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి
- కూలీలకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది కృషి చేయాలి
- అడిషనల్ డీఆర్‌డీఓ కౌసల్యా దేవి



నవ తెలంగాణ రాయపోల్

గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు ఉపాధి కల్పించి వారికి జీవనం కలిగించే విధంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని, ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరిగిన సహించే ప్రసక్తి లేదని అడిషనల్ డీఆర్డీఓ కౌసల్యాదేవి అన్నారు. సోమవారం రాయపోల్ మండల రెండో విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయపోల్ మండలంలోని జనవరి 2021 నుండి మార్చ్ 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. 19 గ్రామ పంచాయతీల పరిధిలోని 1018 పనులు జరిగాయని ఇందులో కూలీలకు 45 లక్షల మంది 65 లక్షల రూపాయలను చెల్లించడం జరిగిందన్నారు. అలాగే గ్రామ పంచాయతీలో జరిగిన మెటీరియల్ పేమెంట్ కు సంబంధించిన 99 లక్షల 94 వేల 900 రూపాయలు చెల్లించడం జరుగగా మొత్తం 5 కోట్ల 56 లక్షల 4 వేల 602 రూపాయల పనులు జరిగినట్లు వీటి పై ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించి గ్రామసభలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల కూలీల సమక్షంలో చేపట్టిన పనులు పూర్తి వివరాలను వివరించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం పనులను అక్రమాలు చేస్తే సహించబోమని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పనుల నిర్వహణలో రాయపోల్ మండలం వెనుకబడిపోవడం పట్ల అధికారుల పనితీరుపై ఏపీడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ రికార్డులను ఎప్పటికప్పుడు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి అప్ డేట్ గా ఉంచుకోవాలని ఈజీఎస్ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో పనులు మంచిగానే ఉన్నాయని. మరికొన్ని గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉండడం పట్ల సిబ్బంది పనితీరుపై అసనం వ్యక్తం చేశారు. ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేస్తూ ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలని సూచించారు. అధికారులు ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా 2020 లో జరిగిన సామాజిక తనిఖీలలో జరిమానాలు, రికవరీలు అధికంగా చెల్లించడం జరిగిందని కానీ ప్రస్తుతం ఈ తనిఖీలలో మాత్రం చాలా తక్కువ మొత్తంలో జరిమానాలు, రికవరీలు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. మొత్తంగా 37 వేల రూపాయల జరిమానాలు, 8760 రికవరీలు మాత్రమే వేయడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు అధికారులు సమిష్టి కృషితో ఈ సాధ్యమైందని మరింత మెరుగైన ఫలితాలు వచ్చేందుకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో 100 శాతం పని చేసి కూలీలకు ఉపాధి కల్పించిన వడ్డేపల్లి పంచాయతీ కార్యదర్శి రాధ, వీరారెడ్డి పల్లి పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంకిరెడ్డి పల్లి పంచాయతీ కార్యదర్శి గణేష్, చిన్న మాసాన్ పల్లి పంచాయతీ కార్యదర్శి నితీష్ లను సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఏపీడి సతీష్ కుమార్, ఒంబుడ్స్ మెన్ అరీఫ్ అలీ, ఎస్ఆర్పిలు శ్రీకాంత్, యాదగిరి, క్వాలిటీ కంట్రోల్ అధికారి సంతోష్ రెడ్డి, ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్, జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, ఎంపీడీవో మున్నయ్య, ఎంపీఓ లక్ష్మీనారాయణ, ఏపీవో రాములు, డిఆర్పీలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

జిల్లా (అదనపు) కలెక్టర్ గరీమ అగర్వాల్

నవ తెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్



ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి నుంచి అర్జీలు తీసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించి వారంలోగా రిపోర్ట్ తెలియజేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు మళ్లీ మళ్లీ రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజావాణిలో భూసంబంధిత, ఆసరా పింఛన్లు ఇతర మొత్తం కలిపి (15) అర్జీలు వచ్చాయి. అలాగే అధికారులు అందరూ విధిగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి తప్పక హాజరుకావాలని జిల్లా అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి సమాయత్తం



నవ తెలంగాణ- గజ్వేల్ : గజ్వేల్ పట్టణంలో మంగళవారం స్థానిక ప్రజ్ఞా గార్డెన్‌లో బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, మాజీ జెడ్పీటీసి గుంటుక మల్లేశంలు తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీసీ కులాల ఐక్యవేదిక ఆహ్వానం పలుకుతుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో 177 గ్రామాల్లో కమిటీలను వేస్తున్నామని ఆయన చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఇప్పటికే సభలు సమావేశాలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ కులానికి చెందిన వారందరు తరలి రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీసీ కులాల ఐక్యవేదిక సభ్యులు రాజేశం, గుంటుక,శ్రీనివాస్, నర్సింలు, రామచంద్ర చారి, ఇనుగుర్తి యాదగిరి, కన్నయ్య యాదవ్, గాడి పల్లి శ్రీనివాస్, రొట్టెల శ్రీనివాస్, చంద నరసింహులు, మురళి, హైదర్ ఇగ్బాల్, మాజీ సర్పంచ్ ఐలం, మాజీ ఎంపీటీసీ భూమా గౌడ్, గౌడ్పల్లి అనూఫ్, బలరాం, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంజీరా నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో నిర్లక్ష్యం



నవతెలంగాణ-పాపన్నపేట

మెదక్ కామారెడ్డి జిల్లాలను కలుపుతూ పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థం శివారులో మంజీరా నదిపై నిర్మించిన బ్రిడ్జి పనులను అసంపూర్తిగా వదిలివేశారు. ఈ పనులను వెంటనే చేపట్టకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టి నిరసన తెలుపుతామని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 2018లో నిర్మాణం చేపట్టిన బ్రిడ్జి పనులను ఇప్పటివరకు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలి వేయడంతో రెండు జిల్లాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బ్రిడ్జికి కామారెడ్డి జిల్లా వైపు రోడ్డు పనులు పూర్తి కాగా మెదక్ జిల్లా వైపు ఉన్న రోడ్డు మార్గం పూర్తి కాకపోవడం మెదక్ ఎమ్మెల్యే పనితీరుకు నిదర్శనమన్నారు. వెంటనే పనులు చేపట్టి రోడ్డుతో పాటు బ్రిడ్జిను అందుబాటులోకి తేవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఏడుపాయల బంగారం విషయంలో ఈవో పదేపదే దేవన్న అనే పదం ఉచ్చరించడంతో ఈ కుంభకోణంలో దేవేందర్ రెడ్డి పాత్ర ఉందని వారు ఆరోపించారు. అంతేకాకుండా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఈఓను సస్పెండ్ చేయాలని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. బంగారం తరలింపు విషయంలో చైర్మన్‌కు తెలియనప్పుడు పాలకమండలి ఎందుకని వారు ప్రశ్నించారు. నైతిక బాధ్యత వహించి పాలకమండలి చైర్మన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ హయంలోనే ఏడుపాయల అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి. డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్,, పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక,. జిల్లా నాయకులు నిట్టలాక్షప్ప, ప్రేమ్ కుమార్, మహేందర్ రెడ్డి, ఈశ్వరప్ప, ఎంపీటీసీలు శ్రీనివాస్ రమేష్ తదితరులు ఉన్నారు.

మసీద్ కాంపౌండ్ వాల్‌కు రూ.5 లక్షలు మంజూరు

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి మసీద్ కాంపౌండ్ వాల్‌కు మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు గౌస్, దుబ్బరాజ్యం గౌడ్, షబ్బీర్ ఫిరోజ్ ఎక్స్ ఎంపీటీసీ అంజా గౌడ్, సులేమాన్, మదర్, ఫారూఖ్, సయ్యద్ కాజా, జావీద్, గోరిమియా తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణ కోసం కరెంటు.. రైతు మృతి

- అడవిపందుల బారి నుంచి తప్పించుకునేందుకే ప్రయత్నం
- మైమరిచిపోయి విగత జీవిగా మృత్యువాత
- సీతారాం తండాలో ఘటన

నవతెలంగాణ- కొల్చారం



పంట రక్షణ కోసం అడవి పందుల బారి నుంచి తప్పించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను మరిచిపోయిన ఓ రైతు పంట పొలానికి నీరు పారించేందుకు వెళ్లి అదే విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాత పడ్డ దుర్ఘటన కొల్చారం మండలం సీతారాం తండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ గోవర్ధన్ (54) తన వ్యవసాయ పొలంలో వరి పంట సాగు చేశాడు. రాత్రి వేళలో పంట కావల కోసం ఎంత ప్రయత్నించినా అడవి పందులు ఏదో ఒక రోజు వస్తూ పంటను నాశనం చేస్తున్నాయని, దీంతో చేసేదేమీ లేక ఆదివారం రాత్రి పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. అమర్చిన తీగలను మరిచిపోయి కరెంట్ కనెక్షన్ తీయకుండా తెల్లవారుజామున పంటకు నీరు పారించేందుకు వెళ్లి విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. చాలాసేపటికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలంవద్దకు వెళ్లి చూడగా అప్పటికే విగత జీవిగా వరి పంటలో పడి ఉన్నట్లు గమనించారు. దీంతో రోధించగా, ఇరుగు పొరుగువారు వచ్చి చూసేసరికి అప్పటికే రైతు చనిపోయినట్లు తెలిపారు. అనంతరం కరెంటు వైర్లను తొలగించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతుడి భార్య బాబ్లీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

గౌడ సంఘం భూమి సంఘనికే కేటాయించాలి

- ఆర్డీవో, తహసీల్దార్‌కు వినతి పత్రం
- నవ తెలంగాణ-కొమురవెల్లి



మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి దేవస్థానం వద్ద 8 సంవత్సరాల క్రితం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్న దాన సత్రంకు కేటాయించిన 10 గుంటల ఖాళీ స్థలాన్ని కొందరు పక్క దారి పట్టిస్తున్నారని ఆ స్థలాన్ని తమ సంఘానికే కేటాయించాలని సంఘం నాయకులు సోమవారం సిద్దిపేట ఆర్డీవో రమేష్ బాబు, స్థానిక తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ స్థల విషయాన్ని మంత్రి హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాల క్రితమే స్థలంలో నీటి వసతి కోసం బోరు వేయించి సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. 10 గుంటల ఖాళీ స్థలాన్ని కొంతమంది రాజకీయ నాయకులు వేరే సంఘానికి కేటాయించే విధంగా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కుట్ర రాజకీయాలు మానుకొని తమ గౌడ సంఘానికి అ స్థలం కేటాయించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మెరుగు కృష్ణ గౌడ్, ముత్యం నర్సింహులు గౌడ్, రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్, మండల ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాజు గౌడ్, కోశాధికారి బుడిగే గురువయ్య గౌడ్, ముత్యం పర్శా రాములు గౌడ్, ముత్యం విజయ్ కుమార్ గౌడ్, కొయ్యడ నరేష్ గౌడ్, ముత్యం విజయ్, కనకయ్య, బూరుగు శ్రీను, పచ్చిమడ్ల ఐలయ్య, పచ్చిమడ్ల ఎల్లయ్య, పచ్చిమడ్ల శ్రీను, మెరుగు బాలరాజు, బూరు శీను తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవ తెలంగాణ-నిజాం పెట



మండల పరిధిలోని బచ్చురాజుపల్లికి చెందిన కుమ్మరి సిద్దరములు (55) ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మైనంపల్లి సోషల్ సర్వీస్ ఫౌండర్ మైనంపల్లి రోహిత్ రావు తన సహచరులతో మృతుని కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5000లను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, రమవత్ మంగ్య నాయక్ , రమావత్ శ్రీనివాస్, నేనవత్ సంతోష్, అజయ్, రమావత్ సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ ఎవరికో

- టికెట్ కోసం నలుగురి మధ్య పోటీ
- నువ్వా నేనా అంటున్న గాలి, ఆవుల



నవ తెలంగాణ-నర్సాపూర్

వచ్చే ఎన్నికల్లో నర్సాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పిస్తుందోనని కాంగ్రెస్ కార్యకర్తల్లో చర్చలు తలెత్తాయి. అయితే టికెట్ కోసం మాత్రం హైదరాబాదులోని గాంధీభవన్‌లో నలుగురు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తు చేసుకున్న వారిలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, సోమన్న గారి రవీందర్ రెడ్డిలు ఉన్నట్లు తెలిసింది. అయితే టికెట్ కోసం నలుగురు అధిష్టానం పెద్దల వద్ద తీవ్రంగా ప్రయత్నాలు జరుపుతున్నట్లు సమాచారం. అధిష్టానం మాత్రం ఈ స్థానం నుంచి బలమైన అభ్యర్థిని బరిలో నిలిపి ఈ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని యోచిస్తుంది. దరఖాస్తు చేసుకున్న నలుగురిలో ఎవరు ప్రజాబలం, ధన బలం కలిగి ఉన్నారని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

అనుభవం, పట్టున్న గాలి

టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన అనుభవం ఉండడమే కాకుండా ఆయనకు నియోజకవర్గంలో పట్టు ఉంది. ఈ నియోజకవర్గంలో గత కొంతకాలంగా వివిధ సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రజల మధ్యన ఉంటున్నారు. ముఖ్యంగా రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర రాష్ట్రంలో విజయవంతం కావడానికి గాలి అనిల్ కుమార్ కృషి చేశారని ఆయన వర్గీయులు స్పష్ట చేస్తున్నారు. అదే ఉద్దేశంతో కాంగ్రెస్ అధిష్టానం నర్సాపూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు గాలి అనిల్ కుమార్‌కే అవకాశం కల్పిస్తుందని ఆయన అనుచరులు ధీమాగా ఉన్నారు.

చురుగ్గా పాల్గొంటున్న రాజి రెడ్డి

టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆవుల రాజిరెడ్డికి ఈ నియోజకవర్గంలో చాలా పట్టుంది. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రాజిరెడ్డికి బలమైన కార్యకర్తలు ఉన్నారని ఆయన అనుచరులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చె పిలుపు మేరకు నియోజకవర్గంలో కార్యకర్తలను సమీకరించడంతో పాటు, రాజిరెడ్డి తన సొంత డబ్బులు పెట్టుకుని విజయవంతం చేస్తున్నారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. గతంలో వెల్దుర్తి మండలంలో అత్యధిక ఎంపీటీసీ స్థానాలను గెలవడానికి రాజిరెడ్డి ఎంతో కృషి చేశారని అంటున్నారు. అదే అనుభవంతో రాజిరెడ్డికి అధిష్టానం కాంగ్రెస్ టికెట్ ఇస్తుందని ఆయన అనుచరులు అంటున్నారు.

బీసీ మార్కు ఆశల్లో ఆంజనేయులు గౌడ్

కాంగ్రెస్ పార్టీ ఈ సారి బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయిస్తుందని అధిష్టానం చెప్తున్నందున బీసీ వర్గానికి చెందిన వ్యక్తి అయినందున తనకే టికెట్ వస్తుందని టీపీసీసీ రాష్ట్ర నాయకులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ ధీమాగా ఉన్నారు. రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ పార్టీకి నమ్మకమైన వ్యక్తిగా చలామణి అవుతూ వస్తున్నారు. విద్యార్థి దశ నుంచి ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పదవులు చేపట్టి ఎన్నో ఉద్యమాలు చేశారు. గతంలో నర్సాపూర్ నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేసిన సునీత రెడ్డికి, రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ ముఖ్య అనుచరులుగా ఉండేవాడు. గత ఎంపీ ఎన్నికల్లో సునీత రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన ఆంజనేయులు గౌడ్ మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని అతని అనుచరులు అంటున్నారు.

అధిష్టానంపైనే సోమన్న ఆశలు

తెలంగాణ ఉద్యమ సమయంలో సోమన్న గారి రవీందర్ రెడ్డి, అతని భార్య స్వర్గీయ సోమన్న గారి లక్ష్మిలు సొంత డబ్బులు పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేశారు. 2014లో ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ రెడ్డి గెలుపు కోసం భార్యాభర్తలు ఇద్దరూ ఎంతో కృషి చేశారని అతని అనుచరులు అంటున్నారు. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీలో వారికి తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో బిఆర్ఎస్ పార్టీని వీడి భార్య భర్తలు ఇద్దరూ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటినుంచి నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సోమన్న గారి రవీందర్ రెడ్డి ఎంతో కృషి చేస్తూ వస్తున్నారు. రవీందర్ రెడ్డికి నియోజకవర్గంలో తిరుగుతూ కార్యకర్తల్లో పట్టును సాధించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్న తనకు ఈసారి అధిష్టానం టికెట్ ఇస్తుందని సోమన్న గారి రవీందర్ రెడ్డి అనుచరులతో చెబుతున్నట్లు సమాచారం.

నువ్వా...నేనా

నర్సాపూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ టికెట్ విషయంలో ఇద్దరి మధ్యే తీవ్రమైన పోటీ ఉంటుందని నియోజకవర్గంలో పలువురు చర్చించుకుంటున్నారు. టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్న గాలి అనిల్ కుమార్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆవుల రాజిరెడ్డిల పేర్లను అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రజాబలం, ఆర్థికంగా బలంగా ఉండడంతో వీరిద్దరిలో ఎవరికో ఒకరికి టికెట్ వస్తుందని వారి అనుచరులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం త్వరలో అభ్యర్థులను ప్రకటిస్తుందని తెలుస్తున్నందున నర్సాపూర్ నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎవరికి టిక్కెట్ ఇస్తుందో వేచి చూడాలి మరి.

చెరువును తలపిస్తున్న రంగంపేట పాఠశాల ఆవరణ

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కొల్చారం



గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం చెరువును తలపిస్తోంది. సోమవారం కురిసిన భారీ వర్షానికి పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆ నీటిలో నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొద్దిపాటి కాలువ తీస్తే పడిన వర్షపు నీరు నిలవకుండా వెళ్లే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్



చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని జక్కన్నపేట లో జరిగింది. హవేలి ఘనాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సమీపంలోని కొత్తచెరువులోకి గ్రామానికి చెందిన శీల సిద్దయ్య (54) చేపల వేటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో మృతిని భార్య అటువైపు వెళ్లి చూడగా సిద్దయ్య తలకు తీవ్ర గాయాలై చనిపోయి ఉన్నాడు. వలవేసి క్రమంలోనే కాలుజారి బండపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు హవేలీ ఘనపూర్ ఏఎస్ఐ సమీ ఉద్దీన్ తెలిపారు. పోస్టుమార్టం కోసం సిద్దయ్య మృత దేహాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏ ఎస్ఐ తెలిపారు.

మంత్రి గారూ మీ హామీ ఏమైంది

నవ తెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్



గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెను మంత్రి హామీతో విరమించామని వెంటనే పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి (సీఐటీయూ) ఆసిఫ్ డిమాండ్ చేశారు. సోమవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ మాట్లాడుతూ గత 34 రోజుల సమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మెను చేపట్టినట్టు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర జేఏసీ నాయకత్వంతో జరిపిన చర్చల అనంతరం మంత్రి జేఏసీ నాయకత్వానికి సమ్మె విరమించి కార్మికులు అందరూ విధులలో చేరిన 3 రోజుల తర్వాత కార్మికుల సమస్యలను 1,2 మినహా మిగతా డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది తెలిపారు. కానీ సమ్మె విరమించి 26 రోజులు గడిచినా ప్రభుత్వ నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని ఎడల తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్మికులు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా జీవో నెంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీలో ప్రతి ఉద్యోగ కార్మికులకు మల్టీపర్పస్ పేరుతో కాకుండా క్యాటగిరిల వారిగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్స్. కారోబార్ బిల్ కలెక్టర్‌లకు సహాయ కార్యదర్శి హోదా కల్పించాలని, జీవో నెంబర్ 51 ని సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి కార్మికులకు ఈ ఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం మల్టీపర్పస్ వర్కర్స్ పేరుతో ఇస్తున్న గుర్తింపు కార్డులను రద్దు చేయాలి. ట్రాక్టర్ డ్రైవర్లకు ఏటువంటి అర్హత లేకుండా లైసెన్సులు ఇవ్వాలి. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2023 లెక్కల ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు స్వామి అంజయ్య రమేష్, మహేందర్, బాలమని. శోభ, ఎలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పాపన్నపేట



పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామానికి చెందిన బేడ బుడగ జంగం కాలనీలో నివసిస్తున్న వడ్డెర కులానికి చెందిన యువకుడు మొక్కల స్వామీ బ్రతుకు దెరువుకు నిజామాబాద్ జిల్లాలో కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. కాగా అక్కడ ప్రమాదవశాత్తు మరణించగా,అతని ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఈ విషయాన్ని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, అందుకు స్పందించిన ఆమె సోమవారం మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.10000/-అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాశయ్య, ఎంపిటిసి జ్యోతి సాయిలు, ఏడుపాయల మాజీ చైర్మన్ కె.వెంకటేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ గోపాల్, బేడ బుడగ జంగాల సంఘం రాష్ట్ర నాయకులు నర్సింలు(డిగ్రీ), బిఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యేకు నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన కమ్మరి సిద్ధ రాములు మృతి చెందిన విషయం తెలుసుకొని తక్షణ సాయం కింద మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాంటారెడ్డి తిరుపతి రెడ్డి రూ.5000అ ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పంజా మహేందర్, పట్టణ అధ్యక్షుడు నసురుద్దీన్, యూత్ అధ్యక్షులు రామావత్ వినోద్, భూమా గౌడ్, రమేష్, మల్లేశం, పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నార్సింగి





మండలంలోని కాసులాపుర్ గ్రామంలో సెప్టెంబర్ 2 నుంచి మూడు రోజులుగా జరుగుతున్న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారంతో ముగిసింది. చివరి ఘట్టం విగ్రహ ప్రతిష్ఠ శాస్త్ర ప్రక్రారం వేద మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాసులాపుర్ గ్రామంలో ఎప్పటి నుంచో గుడి నిర్మించుకోవాలని అనుకున్నారని, ఇప్పుడు గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా గుడి నిర్మాణం చేసుకుని, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మూడు రోజుల నుంచి వేద మంత్రాల నడుమ అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ చేసుకోవడం సంతోషకరమని, గామస్థుల అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామస్తుల కోరిన విధంగా గ్రామంలో యాదవ సంఘం భవనం నిర్మాణం కొరకు వారంలోపు నిధులు మంజూరు చేస్తానని, సంఘం భవనానికి శంకుస్థాపన కూడా చేస్తానని చెప్పారు. స్వంత జాగ ఉండి ఇల్లు నిర్మాణం చేసుకోవాలనుకునే వారికీ మూడు లక్షలు మంజూరు చేస్తానని, ఆసరా పెన్షన్లు ఎవరికైనా రాని పక్షంలో పెన్షన్లు అందేలా చేస్తానని, గ్రామానికి 38 యూనిట్లు గొర్రె పిల్లలను ఇవ్వడం జరిగిందని, రాని వారు ఎవరైనా ఉంటే వారికి కూడా మరో విడతలో తప్పకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. రైతు బంధు రైతు భీమా పథకాలు అందరికీ అందుతున్నాయని అన్నారు. గ్రామసులు కలిసికట్టుగా ఆలయ నిర్మాణమే కాకుండా అంగరంగ వైభవంగా విగ్రహం ప్రతిష్ఠించుకోవడం తనకు సంతోషం కలిగించిందన్నారు. ఆంజనేయ స్వామి దీవెనలతో అందరూ ఇలాగే కలిసి మెలసి, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు వీరాబోయిన లింగం, ఉపాధ్యక్షుడు పెద్ద మల్లేశం, కోశాధికారి ప్రవీణ్, సలహాదారుడు మల్లేశం, మహేష్, నార్సింగి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు యాదగిరి, పార్టీ నాయకుడు గణేష్, యాదవ సంఘం సభ్యులు రవి, శ్రీనివాస్, అశోక్, లింగం, సోమయ్య, నవీన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఎల్ల చిన్న పోచయ్య మరణించినందున వారి కుటుంబాన్ని బీజేపీ నాయకులు పరామర్శించారు. వారి కుటుంబానికి మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ స్పందించి తన వంతు సహాయంగా రూ.5000ల ఆర్థిక సహాయాన్ని బీజేపీ కార్యకర్తల ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు పొన్నబోయిన ప్రవీణ్, రుద్రారం స్వామి గౌడ్, రంజిత్ గౌడ్ జిల్లా, శ్రీకాంత్ గౌడ్, పర్ష గౌడ్, మంచోళ్ళ నాగరాజు, అనుప పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- మున్సిపల్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)





తూప్రాన్ మున్సిపల్‌లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఉద్యోగులు మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్, కమీషనర్ మోహన్‌లకు వినతి పత్రాలను అందజేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ కలిసి వినతి పత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడితే తమ బ్రతులు మారుతాయనే ఆశతో అందరం ఉద్యమంలో సకల జనుల సమ్మెలో కీలకంగా పాల్గొన్నట్టు తెలిపారు. ఉద్యమ సమయంలో రాష్ట్రంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ అనే మాటకూడా వినబడ వద్దని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలిపినట్టు వారు గుర్తు చేశారు. కానీ అదే పద్ధతిలో పని చేసే తమ శ్రమను గుర్తించి మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే తాము కరోనా ఆపత్కాల సమయంలో ప్రపంచమంతా స్థంబించిన సమయంలో కేవలం మున్సిపల్ సిబ్బంది, తమ ప్రాణాలను కుటుంబాలను పణంగా పెట్టి సమాజానికి విధులు నిర్వహించామని తెలిపారు. కరోనా వచ్చిన వారి వద్దకు వెళ్లి సహాయం అందించామని అలాగే కరోనా మహమ్మారితో చనిపోయిన వారికి మున్సిపల్ సిబ్బంది దహన సంస్కారాలు చేయడం జరిగిందని తెలిపారు. తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం "॥సలాం అమ్మ సఫాయిఅమ్మ ॥సలాం అన్నా సఫాయి అన్న ॥అని గుర్తించడం జరిగిందన్నారు. గౌరవించిన మాత్రాన తమ బతుకులు బాగుపడలేదని తమ కష్టానికి ప్రతిఫలంగా మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి తమ బతుకుల్లో వెలుగులు నింపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో రెండు మేకల మృతి

నవతెలంగాణ-నంగునూరు



కరెంట్ షాక్ తో రెండు మేకలు మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలో ముడికె గాలయ్య చెందిన రెండు మేకలు మేతకోసం బహిర్భూమికి వెళ్ళగా తెగిన విద్యుత్ వైర్లు తాకి కరెంట్ షాక్ తో అక్కడికక్కడే మృతిచెందాయి.రెండు మేకలు చనిపోవడంతో యాభై వేల వరకు నష్టం వాటిల్లిందని భాదితుడు తెలిపాడు.గాలయ్య జరిగిన విషయం గ్రామ సర్పంచ్ ద్వారా విద్యుత్ అధికారులకు తెలిపారు.లైన్ మెన్ హాజరై విద్యుత్ తీగలు సరిచేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వర్షం గాలితో విద్యుత్ వైర్లు తెగిపోయాయని సంబంధిత అధికారులు వెల్లడించారు.

దళిత యువకులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- డీహెచ్ పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి రూపేశ్

నవతెలంగాణ-బెజ్జంకి



మేకను దొంగిలించారనే నేపంతో మందమర్రిలోని దళిత యువకులపై దాడి చేసిన వ్యక్తులపై ప్రభుత్వాధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టి కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి రూపేశ్ సోమవారం డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక దళిత సామాజిక వర్గాలపై దాడులు జరుగుతున్నాయని.. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు దళిత సామాజిక వర్గాలను అణచివేతకు గురిచేస్తున్నాయని రూపేశ్ మండిపడ్డారు.మందమర్రి ఘటనను దళిత హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తోందని.. ప్రభుత్వాధికారులు దాడి చేసిన వ్యక్తులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా త్వరితగతిన స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

పంటలకు ఊపిరి పోసిన వర్షం

- నెలరోజుల తర్వాత వర్షాలు

నవతెలంగాణ-గజ్వేల్

రెండు రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలకు పంటలకు ఊపిరి పోసినట్లు అయింది. నెల రోజులకు పైగా వర్షా లేకపోవడంతో సాగు చేసిన రైతులు వర్షాల కోసం ఎదురు చూశారు. పంటలని ఎండు ముఖం పట్టడంతో రైతుల ముఖాల్లో సంతోషం లేకుండా పోయింది. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన మోస్తారు వర్షాలు కురవడంతో కొంత పంటలకు జీవి గంజి పోసినట్టు ఉందని రైతులు అక్కడక్కడ చర్చించడం కనిపించింది. జులై 24న కురిసిన కురిసిన భారీ వర్షాల తర్వాత అదే స్థాయిలో ఎండలు మండడంతో పంటలు నీటి తడువుల కోసం ఎదురుచూశాయి. కొందరు రైతులు బోర్ లో నీరు ద్వారా పంటను నీటితో తడిపారు. మరికొందరు వర్షాల మీద ఆధారపడిన రైతుల పంటలు మెరిసిన ఎండలకు ఎండ ముఖం పట్టాయి. ఈ దశలో నెల రోజుల తర్వాత ఆదివారం సాయంత్రం నుండి మోస్తారు వర్షాలు కురవడంతో పత్తి, మొక్కజొన్న, వరి వరి, కంది పంటలు సాగు చేసిన రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు సిద్దిపేట జిల్లాలో పంట నష్టం తీవ్రంగా జరిగింది. మొక్క దశలో ఉండగానే భారీ వర్షాలు వారం రోజులపాటు కోరడంతో సుమారు 10 కోట్ల పంట నష్టం జరిగింది. ఆ తర్వాత చాలామంది రైతులు పత్తి విత్తనాలువిత్తరూ ఆ తర్వాత అప్పుడప్పుడు చిన్నపాటి వర్షాలు కురిసిన పెద్దగా పంటలకు అనుకూలంగా కురువలేకపోయింది. జిల్లాలో వానకాలం సీజన్లో 5.78 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో పత్తి



1.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వరి సాగు నాలుగు లక్షల ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 36 వేలఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పత్తికి ఎకరాకు 20,000 ఖర్చు దాటిందని రైతులు పేర్కొంటున్నారు, మొక్కజొన్నకు ఎకరాకు పదివేల వరకు ఖర్చు అయిందని రైతులు తెలిపారు. మిగతా పంటలకు సైతం కూలీలు, ఎరువుల ఖర్చులు భారీగా అయినట్లు రైతులు ఆవేదనతో చెప్తున్నారు. ఎరువులు ,ఫర్టిలైజర్లు రైల్వే పాయింట్ ద్వారా గజ్వేల్ లో అందుబాటులో ఉండి రైతులకు పంపిణీ చేశారు. కానీ కొందరు కృతిమ కోరుతా సృష్టించి రైతులను అయోమయానికి గురిచేశారు. జిల్లా వ్యవసాయ అధికారులు రంగంలో దిగి రైతులు అందరికీ ఫర్టిలైజర్ అందుబాటులకు తీసుకొచ్చారు. రైతులు పంట పొలాల్లో పనులకు నిమగ్నమయ్యారు.

నవతెలంగాణ-నంగునూరు



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం నంగునూరు మండలం లోని వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం అంతంతమాత్రంగానే కురిసిన వర్షానికి తోడు సోమవారం ఉదయం నుంచి వర్షం దంచికొట్టింది.నెల రోజుల నుంచి వర్షాలు లేక పత్తి, మొక్క జొన్న పంటలు పండే అవకాశం లేకుండా పోయింది. కొన్ని పంటలు వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. నీరున్న రైతులు పంటలు కాపాడుకున్నారు. బోర్లు, బావులు లేని రైతులు రోజు ఆకాశం వైపు చూశారు.వరిసాగు చేసిన రైతులు సైతం వర్షాల కోసం ఎదురు చూశారు. రెండు రోజుల నుండి కరుస్తున్న వర్షాల వల్ల రైతుల కళ్ళలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరవుల్లో, చెక్ డ్యామ్ ల్లో వర్షపు నీరు చేరింది. వర్షాకాలంలో ఎండలు విపరీతంగా ఉండటం వల్ల ఉక్కపోతలు ఎక్కువయ్యాయి. ఈ వర్షంతో వాతావరణ పూర్తిగా చల్లబడింది.రాగల రెండు మూడు రోజులు వర్షాలు కురిసే సూచన ఉందని శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నంగునూరు తహశీల్దార్ అనిల్ కుమార్ పేర్కొన్నారు.

జ్ఞానజ్యోతి గురువు

నవతెలంగాణ-సిద్దిపేట



నల్ల నైన పలక పైన
తెల్లనైనఅక్షరమును
నేర్పిదిద్దినట్టిగురువు

గొప్పవాడుజగతిలోన

హరిని చేరజ్ఞానములను
భక్తి భావ మెళుకువలను
శ్రద్ధ తోడ నేర్పించిన
వందనాలుగురువులకును.

మట్టి ముద్ద తీసుకొనెను
మలిచినాడుమణులుగాను
బండరాయిశిల్పమెలె
చెక్కినాడుచక్కగాను

అంధకారతిమిరములను
దూరముగనుతొలగించును
జ్ఞానజ్యోతిగానునిలిచి
తేజముగనువెలిగించును

జాతిమతముచూడబోడు
ధనికపేదనెంచలేడు
లక్ష్యసాధనందుగురువు
విద్యార్థులనిలుపునెపుడు

చదువులెన్నిచదివినాను
పదువులెన్నొపొందినాను
ఆత్మలోననీవెప్పుడు
మరువబోకుగురువులాను

- మిట్టపల్లి పరశురాములు,
9949144820

ఓ ఉపాధ్యాయుడా..!

నవతెలంగాణ-సిద్దిపేట



– ఓ.. ఉపాధ్యాయుడా ! నవ సమాజ నిర్మాణ సారథుడా !
– విద్యా, వినయం, విధేయతలు నేర్పి చక్కని సంస్కారం, సత్ప్రవర్తన నేర్పి జీవిత లక్ష్యానికి దిశానిర్దేశం చేసి బతుకుపాఠాలను బోధించే విష్ణువు నీవే !
– బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే పరబ్రహ్మ స్వరూపము నీవే ! ఉత్తమ నడవడికలు నేర్పి
– ఉదయభానుడిలా లోకానికి వెలుగు నిచ్చి అజ్ఞాన అంధకారాన్ని పోగొట్టి
– విజ్ఞానమనే వెలుగును
– ప్రసరింపచేసే సూర్యుడు నీవే!
– తల్లిలా ! లాలించి
– తండ్రిలా! పాలించి
– స్నేహితుడిలా హితము కోరి
– బ్రతుకు మార్గం చూపించే
– మహేశ్వరుడు నీవే ! విద్యార్థులకు, వెన్నుదన్నుగా నిలిచి విజయ పథమును జేర్చుటకు
– అనుక్షణం తపించే,
– ఆత్మీయ బంధువు నీవే! నీ కర్తవ్య నిర్వహణలో
– ఎన్నెన్నో రూపాలలో నువ్వు కనిపించినా... నీ రూపం మాకు అపురూపం !
– నిలుస్తుంది మా గుండెల్లో కలకాలం !

- కొడిచెల్లి రామానుజ
తెలుగుభాషోపాధ్యాయురాలు,
సిద్దిపేట, 9666511372.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రతి విద్యార్థినీ విద్యార్థులు పోలీస్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఏసీపీ ఎం.రమేష్ అన్నారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లో విద్యార్థులకు సమాజం పట్ల చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్ స్కూల్ లో పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా ఆదేశానుసారం బాలికల మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించామన్నారు. సైబర్ నేరాల, గుడ్ టచ్ బాడ్ టచ్, తదితర అంశాల గురించి అవగాహన కల్పించిమని పేర్కొన్నారు.కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ప్రత్యేక చర్యలకు ఆదేశాలు జారీ చేశారన్నారు.ఇందులో భాగంగానే షీ టీమ్ దాని ప్రాముఖ్యత నిర్వహించే విధుల గురించి తెలిపమన్నారు.మానవ అక్రమ రవాణా,ఫోక్సో చట్టాల,బాల్య వివాహాలు,ఇవ్ టీజింగ్,గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాల అవగాహన కల్పించామని తెలిపారు. సోషల్ మీడియా తో సైబర్ క్రైమ్స్, సైబర్ సెక్యూరిటీ,మైనర్ డ్రైవింగ్,డయల్ 100 ప్రాముఖ్యత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి తెలిపారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్,సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు వాడటం వల్ల జరిగే పరిణామాల గురించి విద్యార్థినిలకు తెలియజేశారు.గతంలో జరిగిన నేరాల గురించి నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పేర్కొన్నారు.పోలీస్ భరోసా సెంటర్లో ఫోక్సో కేసులలో 18 సంవత్సరాలు లోపు ఉన్న బాలికలకు అందిస్తున్న సేవల గురించి క్లుప్తంగా వివరించారు. మహిళలు గృహహింసకు వరకట్నం గురించి శారీరకంగా మానసికంగా హింసించే తదితర అంశాల కు స్నేహిత మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ వివరించారు.విద్యార్థులు గోల్ గురించి తెలుపుతూ, అపరిచిత వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలని అంశాల పై అవగాహన కల్పించమన్నారు.అంతేకాకుండా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, తదితర అంశాల గురించి చట్టాల గురించి



విద్యార్థినిలకు వివరించారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలన్నాడు. సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ మంజుల, గజ్వేల్ ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ సత్యనారాయణ రెడ్డి,గజ్వేల్ షీటీమ్ సిబ్బంది శ్రీరాములు, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్ళు శ్యామల, లావణ్య, కానిస్టేబుళ్లు మహేష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(నీకు) జన్మను ఇచ్చేది అమ్మా- నాన్న



జ్ఞాన జన్మను ఇచ్చేది గురువే కన్నా
అందుకే ఈ జగతిలోనా..
గురువు స్థాన మూ ఎపుడూ మిన్నా

తన బోధనతో పెరుగును బుద్ధి
తన శోధనతో కలుగూ శుద్ధి
సిద్ధి, బుద్ధి సకలా సంపద
గురువుతోనే నిలుచును నీ ఎద

నేలపై నా నడక, నడతా
నింగి కెగిసె శాస్త్ర చరిత
ప్రతి మనిషి కుండే మానవత
గురువుతోనే నిలుచును ఘనత


నీదు బతుకున రేపటి స్వప్నం
నీ ఘన విజయాల చిహ్నం
బాధ్యత నైన, భగవంతుడి నైనా
నీకు చూపును గురువే నాన్న

అమ్మా నాన్నల సేవించ మంటూ
ఆ దేవ దేవుని దీవించ మంటూ
గురువు రూపాన్ని గుండెల్లోన
గురువు స్థానాన్ని ఈ ఇలలోన
పదిలంగా నిలుపుకుందాం
పదికాలాలు తలుచుకుందాం

- మంగళగిరి రామచంద్రమూర్తి
కవి, రచయిత, బాలసాహితీవేత్త,
ప్రభుత్వ ఉపాధ్యాయులు
చేర్యాల, సిద్దిపేట జిల్లా

జ్ఞాన జ్యోతి మా గురువు

నవతెలంగాణ - సిద్దిపేట



సృష్టిలో జ్ఞాన జ్యోతి మా గురువు..
నా దృష్టిలోన దేవుడాయె మా గురువు

వెలుగు చూపు విద్య నేర్పి
విలువలతో నడత చూపి
మొక్కోలే పెంచినాడు మా గురువు
తల్లివేరు తానైతీర్చె మా గురువు...సృష్టి...

అక్షరాల విత్తు జల్లి
లక్షణాల పంట పెంచి
దీక్షబూని శిక్షణిచ్చె మా గురువు
రక్షణగా నీడాయె మా గురువు...సృష్టి..

దీపమోలె కాలుకుంటు
వెలుగు పంచి వెతలు పడుతు
వెన్నలిచ్చె జాబిల్లి ..మా గురువు
చల్లనైన మనసు వాడు మా గురువు...సృష్టి

ఆశ పెంచి ఆదరించి
అడుగడుగున నీతినేర్పి
నేతనన్ను చేసినాడు మా గురువు
దైవమోలె కనిపించే మా గురువు...సృష్టి

- డా.బి.సుధాకర్, సిద్దిపేట,
9849243908

ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ -గజ్వేల్





ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గజ్వేల్ మండల పిఆర్టియు అధ్యక్షులు ఊడేము వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగం గౌడ్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. సంవత్సరాలకొద్ది పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విషయంలో ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. సిపిఎస్ పథకం అని ఉపాధ్యాయుల ఉద్యోగుల డబ్బులు ప్రైవేట్ కంపెనీలో షేర్ల ద్వారా వ్యాపారం చేయడం సమావేశం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ పథకాన్ని రద్దుచేసి ఓపీఎస్ పథకం ప్రవేశపెట్టాలన్నారు. అందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి వేలాది మంది ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేసి రెండు లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ జీవితాల్లో వెలుగు నింపాలని వారు కోరారు. మధ్యంతర భృతి ప్రకటిస్తూ పిఆర్సి కమిషన్ ఏర్పాటు నూతన పెన్షన్ విధానం రద్దు పరచి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తెలంగాణ ఉపాధ్యాయ పక్షపాతిగా ముఖ్యమంత్రి మరోసారి నిరు నిరూపించుకోవాలని వారు కోరారు. గౌరవ హైకోర్టు అనుమతి ఇవ్వగానే పదోన్నతులు బదిలీలు షెడ్యూల్ ప్రకటించడం ప్రభుత్వానికి పిఆర్టియు మండల శాఖ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. రాబోయే రోజులు హెల్త్ కార్డు కూడా అందించాలని వారు కోరారు. తెలుగు పోస్టులను ప్రతి హైస్కూల్లో ఒక్కోక్కటి శాంక్షన్ చేసి వాటిని అప్ గ్రేడ్ చేసి పండితులకు పదోన్నతులను కల్పించాలని వారు కోరారు.

బీసీ కూలల ఐక్యవేదిక సమావేశాన్ని విజయవంతం చేద్దాం

నవతెలంగాణ-మర్కుక్

బీసీ కూలాలకు రాజకీయంగా రావాల్సిన వాటాను పోరాడి సాధించుకోవాలని బీసీ కూలల ఐక్యవేదిక మర్కుక్ మండల కన్వీనర్ గుర్రాల స్వామి అన్నారు. సోమవారం మండలంలోని చేబర్తి గ్రామంలో విలేకర్లతో మాట్లాడుతూ నేడు గజ్వేల్ లో నిర్వహించే బీసీ కూలల రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ కూలల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బీసీ కూలల దామాషా ప్రకారం చట్ట సభలలో రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



మండలంలోని అన్ని గ్రామాలలోని బిసి కూలల నాయకులు రాజకీయాలకు అతీతంగా హాజరు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అంజనేయులు, బాలకృష్ణ, శ్రీనివాస్, వరదరాజు, తదితరులున్నారు.

ఎంపీవోను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-తొగుట

ఎంపీవో చందనను మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో విదులు నిర్వహిస్తున్న ఎంపీవో చందన సోదరుడు నారోజు నిరంజన్ ఉదయం విద్యుత్ ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,కో ఆప్షన్ సభ్యులు ఎండీ కలీమొద్దీన్, సర్పంచ్ బొడ్డు నర్సింలు, ఎంపీటీసీ వేల్పుల స్వామి లు సిద్దిపేట లో చందనను పరామర్శించారు.రెండు రోజుల క్రితం నారోజ్ నిరంజన్ వివాహం అయిం ది.ఈరోజు విందు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా విద్యుత్ ప్రమాదంలో వరుడు మృతి



చెందాడు. ఆసుపత్రిలో నిరంజన్ మృత దేహాన్ని దర్శించి నివాళి అర్పించారు.పరామర్శించిన వారిలో పంచాయతీ కార్యదర్శులు నర్సింగరావు, శ్యామల, నిఖిల, బాలమని, రజని తదితరులు ఉన్నారు.

ఇందిరాపార్క్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

- మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మరాటి కృష్ణమూర్తి

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



మాదిగ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు దళిత బంధు ఇవ్వాలని మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మరాటి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం గజ్వేల్ ఆఫీసులో దళిత జర్నలిస్టులతో సమావేశమయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల చైతన్యం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. దళిత జర్నలిస్టులకు రావలసిన మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి సమకూర్చాలు అన్నారు.హక్కుల సాధనకై ఈనెల 6 వ తేదీన ఉదయం11 గంటలకు హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ధర్నాకు సిద్దిపేట జిల్లాలో ఉన్న మాదిగ జర్నలిస్టుల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ లోని టి పి టి ఎఫ్ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎం జె ఎఫ్ డివిజన్ కమిటీ సమావేశం జరిగిందన్నారు. గజ్వేల్ డివిజన్ కన్వీనర్ గా చింతకింది స్వామి, కో కన్వీనర్ లు గా మస్కూరి స్వామి, డప్పు కరుణాకర్, మస్కూరు జాంగిర్ నియమించడం జరిగిందన్నారు. మాదిగ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్రూంలో ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చే దళిత బంధు స్కీమ్ లో మాదిగ జర్నలిస్టులకు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాకు జిల్లాలో ఉన్న మాదిగ జర్నలిస్టులందరూ హాజరుకావాలని కోరారు. ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారు కాబట్టి సిద్దిపేట జిల్లాలోని అన్ని డివిజన్ నుంచి అధిక సంఖ్యలో మాదిగ జర్నలిస్టు హాజరై విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మిట్టపల్లి సాగర్ జర్నలిస్టుల్లో పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక









నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మర్కుక్ మండలంలోని చేబర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఎం.డి షాభోద్దీన్, పాములపర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎం.డి అమీర్ షరీఫ్, ప్రాథమికోన్నత ఎర్రవల్లి లో పనిచేస్తున్న టి. కుమార్, ప్రాథమిక పాఠశాల పాములపర్తి లో పనిచేస్తున్న టి.జైపాల్ రెడ్డి ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మర్కుక్ పిఆర్టీయూ మండల శాఖ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



గజ్వేల్ అయ్యప్ప దేవాలయ 21వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం కమిటీ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించి, పల్లకి సేవ నిర్వహించి, అనంతరం హెూమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని భజన,కీర్తనలు పాటలతో అయ్యప్ప దేవాలయ ప్రాంగణం భక్తి మయమైంది. ఈ సందర్భంగా అయ్యప్ప దేవాలయం కమిటీ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం కేరళలో ఉన్న దేవాలయం మాదిరిగా గత 21 సంవత్సరాల క్రితం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటు న్నామన్నారు. అయ్యప్ప దేవాలయం వార్షికోత్సవం సందర్భ ంగా భక్తిశ్రద్ధలతో వివిధ కార్యక్రమాలు నిర్వహించమ న్నారు. స్వామివారిని అందరూ బాగుండే విధంగా చల్లగా చూడాలని వేడుకోవడం జరిగిందన్నారు. నిత్య నూతనంగా విరాజి ల్లు తున్న అయ్యప్ప దేవాలయంలో స్వామివారిని దర్శించి పూజించిన కోరిన కోరికలు నెరవే రుతాయన్నారు. పురో హితులు నందబాల శర్మ, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు దుర్గాప్రసాద్,ఉపాధ్యక్షులు లగిశెట్టి దుర్గం,ప్రధాన కార్యదర్శి రవీందర్, పోలిశెట్టి శ్రీనివాస్,నారాయణ రెడ్డి, నాయకులు బొగ్గుల సురేష్,జగ్గయ్య గారి శేఖర్, గంగిశెట్టి ఉమేష్, వెంకటేష్,కైలాస ప్రశాంత్,రామచంద్రం, సంతోష్ అయ్యప్ప దేవాలయం కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఐలేని రజనీశ్

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని దాచారం మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐలేని రజనీశ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి సోమవారం ఎంపికయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు పాఠశాలల ఉపాధ్యాయులు రజనీశ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

కట్ చేసిన డబ్బులు పీఎఫ్ ఖాతాలో జమ చేయాలి

నవతెలంగాణ-చేర్యాల

బీడీ ప్యాకర్స్ వద్ద ఆర్/సీ పటేల్ తాజ్ బీడీ కంపనీ యాజమాన్యం పీఎఫ్ కట్ చేసిన డబ్బులను పీఎఫ్ ఖాతాలో జమ చేయాలని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు దాసరి కళావతి డిమాండ్ చేశారు. పీఎఫ్ కట్ చేసిన డబ్బులను పీఎఫ్ ఖాతాలో జమ చేయాలని తెలంగాణ బీడీ అండ్ ఫిగర్ సిగర్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల మండల కేంద్రంలోని తాజ్ బీడీ కంపెనీ కార్యాలయంలో మేనేజర్ ధనర్జీ బాయ్ కి వినతి పత్రం అందజేసేందుకు వెళ్లగా వినతిపత్రాన్ని తీసుకోకుండా తిరస్కరించడంతో అక్కడే ఉన్న నోటీసు బోర్డుకు అతికించారు.ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ తాజ్ బీడీ కంపెనీలో అనేక సంవత్సరాలుగా ప్యాకర్స్ గా పనిచేస్తున్న కార్మికులకు గత ఐదు సంవత్సరాల నుండి పీఎఫ్ డబ్బులు కట్ చేస్తున్నారే తప్ప పీఎఫ్ ఖాతాలో జమ చేయడం లేదని వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. జమ చేయని యెడల లేబర్ కోర్టు లో కేసు వేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీడీ ప్యాకర్స్ బండి శ్రీనివాస్, మద్దూరు నర్సింహులు, పాక సత్తయ్య, పాకనాటి నర్సింగరావు, ముత్తి గారి శ్రీనివాస్, దాసరి వెంకటేష్, మల్లిగారి సంతోష్,పంతం కనకయ్య,దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బిగ్ బాస్ సీజన్ సెవెన్‌లోకి గజ్వేల్ యువరైతు

- యూట్యూబ్ ద్వారా నాగార్జునకు విజ్ఞప్తి
- ఫలించిన ప్రయత్నం
- 13వ కాంటెస్ట్‌గా గజ్వేల్ బిడ్డ పల్లవి ప్రశాంత్

నవతెలంగాణ -గజ్వేల్



యూట్యూబ్ ద్వారా అనేక పల్లె పాటలు, ఇతర కార్యక్రమాలు చేస్తూ పాపులర్ అయిన గజ్వేల్ బిడ్డ పల్లవి ప్రశాంత్‌కు అరుదైన గౌరవం, అవకాశాలు నడుస్తూ వచ్చాయి. దశాబ్ద కాలంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ సీనియర్ నటుడు అక్కినేని నాగార్జున నిర్వహిస్తున్న బిగ్ బాస్ కార్యక్రమంలోకి గజ్వేల్ మండలం కొలుగూరు గ్రామానికి చెందిన పల్లవి ప్రశాంత్‌కు అవకాశం దక్కింది. బిగ్ బాస్ కార్యక్రమంలోకి 13వ కాంటెస్ట్ గా ప్రశాంత్ అందులోకి అడుగు పెట్టారు. కొలుగూరు గ్రామానికి చెందిన తండ్రి గొడుగు సత్తయ్య, విజయలక్ష్మి మొదటి కొడుకు గొడుగు పల్లవి ప్రశాంత్ డిగ్రీ చదువుకొని తండ్రికి కుటుంబ పోషణ భారం కావడంతో ఆర్థిక పరిస్థితి అంతగానే ఉండడం అర్థం చేసుకున్న ప్రశాంత్ జీవితంలో ఒక అడుగు ముందుకు వేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు. తల్లిదండ్రులకు వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టి అన్ని వ్యవసాయ పనులు చేసుకుంటూ ముందుకు సాగుతూ టిక్ టాక్ తో పాటు సోషల్ మీడియాలో వెరీ వెరీ గా వీడియోలు చేస్తూ మంచి పాపులర్ అయ్యారు. 2017 నుండి సినిమాలపై మక్కువ పెంచుకున్న ప్రశాంత్ తాను ఇంటిలో బయటలో చేసిన అన్ని వీడియోలను ఫేస్బుక్ ఇన్స్టాంగా వీడియోలు అప్లోడ్ చేసేవాడు. గ్రామీణ జానపద వీడియో సాంగ్స్ లో హీరోగా నటించి అలరించారు. షార్ట్ ఫిలిమ్స్ లో చిన్న చిన్న పాత్రలో న్యూస్ ఛానల్లో దండోరా లాంటి ప్రోగ్రామ్స్ నటించాడు రైతుబడే కష్టం పై వీడియోలు చేస్తూ దాదాపు 5 లక్షల మందికి దగ్గరయ్యాడు. గత మూడు సంవత్సరాల నుండి బిగ్ బాస్ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ వీడియోలు అన్నిటిని నాగార్జున కు అప్లోడ్ చేసి పంపారు. వీటిని పరిశీలించిన బిగ్ బాస్ షో హెూస్ట్ గా ఉన్న నాగార్జున నుంచి పిలుపు వచ్చింది. దీంతో బిగ్ బాస్ సీజన్ 7 లోకి అవకాశం దక్కించుకున్నాడు. మొత్తానికి అతని కోరికను బిగ్ బాస్ టీం సీజన్ సెవెన్ లో రైతుబిడ్డగా రావాలని సూచించడంతో తన లక్ష్యాన్ని చేరుకునే అవకాశం వచ్చిందని పల్లవి ప్రశాంత్ కుటుంబంలో ఆనందానికి అవధులు లేవు. అనుకున్నట్టే బిగ్ బాస్ లోకి బియ్యం బస్తా తో అడుగుపెట్టి అందర్నీ ఆకట్టుకున్నారు. గజ్వేల్ మండలం కొలుగూరు గ్రామానికి చెందిన ప్రశాంత్ కళ్ళలో సంతోషం చూసి నాగార్జున ఫిదా అయిపోయారు. తల్లిదండ్రులకు వ్యవసాయం రైతు గా సహకరిస్తున్న మీరు బిగ్ బాస్ షోకు ఎందుకు రావాలనుకున్నారని ప్రశాంత్ కు నాగార్జున ప్రశ్నలు వేశారు. నేను చేస్తున్న ప్రోగ్రాంలో విషయాల్లో కొందరు హేళన చేశారని ప్రశాంత్ నాగార్జున వివరించారు. మొత్తానికి ప్రశాంత్ అనుకున్న సాధించి ముందుకు సాగారు. బిగ్ బాస్ లోకి అడిగిపెట్టి నా ప్రశాంత్ కు నాగార్జున పచ్చిమిర్చి మొక్కను చేతికిచ్చి దీని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన నవ్వుతూ సూచించారు. దీంతో గజ్వేల్ ప్రాంత ప్రజలు ప్రశాంత్ బిగ్ బాస్ లో పోవడంతో అందరూ అభినందనలు తెలుపుతున్నారు. విడిపోయాక, ఎంసీఏ అటువంటి వీడియోలు ప్రశాంత్ మంచి పేరు తెచ్చిపెట్టాయి.

సాగు నీటి మణిహారంగా చెక్ డ్యామ్‌లు



నవ తెలంగాణ - సిద్దిపేట: సిద్దిపేట నియోజకవర్గం చుట్టూ భూగర్భ జలవనరుల వలయంగా.. సాగు నీటి మణిహారంగా.. చెక్ డ్యామ్ లు నిర్మాణం చేపట్టామని, సిద్దిపేట నియోజకవర్గంలో మరో రెండు చెక్ డ్యామ్ ల నిర్మాణాలకు రూ.4కోట్ల 62 లక్షల 90 వేలు నిధులు మంజూరు అయినట్లు మంత్రి హరీశ్ రావు తెలిపారు. సీఎం కేసీఆర్ చెక్ డ్యామ్‌లకు నాంది పలికితే, దాని కొనసాగింపుగా సిద్దిపేట నియోజకవర్గంలో దాదాపు 40 చెక్ డ్యామ్ లు నిర్మించుకున్నామన్నారు. సిద్దిపేట వాగు పై 29 చెక్ డ్యామ్ లు, పెద్ద వాగు పై 9 చెక్ డ్యామ్ లు ఉన్నాయని, మరో రెండు కొత్తగా చెక్ డ్యామ్ లు మంజూరైనట్లు తెలిపారు. సిద్దిపేటలో రంగనాయక సాగర్ తో చెక్ డ్యామ్ లు మండుటెండల్లో కూడా పరవళ్లు తొక్కాయని, భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. సిద్దిపేట వాగు పై కస్తూరి పల్లి గ్రామం వద్ద మరో చెక్ డ్యామ్ నిర్మాణం కొరకు రూ.3కోట్ల 28 లక్షలు మంజూరు అయ్యాయ్ అని, ఈ చెక్ డ్యామ్ కింద 200 ఎకరాలు ఆయకట్టు ఉంటుందని 4 గ్రామాలకు లబ్ది చేకూరనుందన్నారు. అదేవిధంగా నారాయణ రావు పేట మండలం గోపులా పూర్ గ్రామం వద్ద మరో చెక్ డ్యామ్ నిర్మాణం కు కోటి 34 లక్షలు మంజూరు అయ్యాయని, ఈ చెక్ డ్యామ్ కింద 50 ఎకరాల ఆయకట్టు ఉంటుందన్నారు.

నిరంజన్ మరణం తీరని లోటు



నవ తెలంగాణ-సిద్దిపేట: నిరంజన్ మరణం ఉపాధ్యాయ, యుటిఎఫ్‌కు తీరని లోటని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కోశాధికారి టీ లక్ష్మారెడ్డిలు అన్నారు. నిరంజన్ సోమవారం ఉదయం తన స్వగృహంలో కరెంట్ షాక్‌తో మరణించడం అత్యంత బాధాకరమని, సంఘానికి తీరని లోటని టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎస్కే వలీ అహ్మద్, టీ.యాదగిరి అన్నారు. సోమవారం నిరంజన్ భౌతిక కాయాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు ప్రారంభం కాగానే వారు పాడేను మోసారు. 2న బోధన్‌లో వివాహం, సోమవారం సిద్దిపేటలో రిసెప్షన్‌లో కలిసి మీరు తప్పనిసరిగా రావాలి సార్ అని ఆత్మీయంగా ఆహ్వానించాడని, వస్తానని చెప్పానని, అంత్యక్రియలకు హాజరు కావాల్సిరావటం అత్యంత బాధాకరమని వారన్నారు. చురుకైన, నిబద్ధత కలిగిన కార్యకర్త కా.నిరంజన్ మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి, టిఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లాకు తీరని లోటన్నారు. అంత్యక్రియలలో జిల్లా నాయకులు కృష్ణ, ప్రశాంత్ కుమార్, సుధాకర్ కనకరాజు, శివలింగం గిరిబాబు, రాజయ్య, రమేష్, యాదగిరి, రామచంద్రం, వెంకటేశం, రాజు, శ్రీకాంత్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



నవ తెలంగాణ -గజ్వేల్

18 యేండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని అమూల్యమైనదని ఓటు నమోదుతో పాటు ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ ఓటర్ లీస్టులో పేరు నమోదు చేసుకోవడానికి మీసేవ ద్వారా గాని నెట్ సెంటర్ల ద్వారా గాని ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా అప్లై చేసుకోవాలని తెలిపారు. అందరూ తప్పనిసరిగా ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించి పోలింగ్ శాతాన్ని పెంచెందుకు కృషి చేయాలనీ ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని యువతీయువకులు సెప్టెంబర్ 19 వరకు ఉన్న ఓటరు నమోదు అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి హరీశ్‌రావుకు పెండ్లి పత్రిక అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని వరదరాజుపూర్ మాజీ సర్పంచ్ లక్కాకుల నరేష్, మండల కో-అప్షన్ సభ్యులు లక్కాకుల సాహేర నరేష్, కుమారుడు లక్కాకుల అఖిల్ రాజ్ వివాహం ఈ నెల 8న శామీర్ పేట మండలంలోని అంతాయిపల్లిలో ఎస్.ఎన్.ఆర్. పుష్పకన్వెన్షన్‌లో జరుగనున్నది. ఈ మేరకు సోమవారం మంత్రి హరీశ్ రావుకు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిలను మండల కొ-అప్షన్ సభ్యులు లక్కాకుల సాహేర నరేష్ కలిసి వివాహానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్, జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఆర్.ఉపేందర్ రెడ్డి, తదితరులున్నారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

నియోజకవర్గంలోని ప్రజలందరూ శాంతి సౌభాగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ గ్రామంలో శ్రీ మహాచండి ఆలయ నిర్మాణానికి భూమిపూజ, పందిల్ల గ్రామంలో శ్రీ మహాలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలలో ఆధ్యాత్మిక వికాసానికి దేవాలయాలు దోహదం చేస్తాయన్నారు. ప్రజలందరూ సంస్కృతి సాంప్రదాయాలు పెంపొందించుకోవాలని మహాలింగేశ్వర స్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాజారెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, ఎంఎంపీ ఎంపీపీ లకావత్ మానస సుభాష్, సర్పంచ్ లు తోడెటి రమేష్, పిట్టల సంపత్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవ తెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లి గ్రామానికి చెందిన ఇద్దరికీ సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని ఈ జి ఎస్ స్టేట్ కౌన్సిల్ డైరెక్టర్ కోలా సద్గుణ తెలిపారు. గ్రామానికి చెందిన రజితకు అరవై వేలు, రామవ్వకు 30 వేలు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైనట్టు తెలిపారు. చెక్కులను వారికి అందజేసినట్టు ఆమె తెలిపారు.

దశ దిన కర్మలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-తొగుట

డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి మాతృమూర్తి లక్ష్మీ దశదిన ఖర్మ సోమవారం కొండపాక మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి సొసై టీ చైర్మన్ కె. హరికృష్ణా రెడ్డి,మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు సిరినేని గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ బోడ్డు నర్సింలు,మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కంది రాంరెడ్డి,నాయకులు బాల్ రెడ్డి,పులి రాజు, ఎల్లం, బండారు స్వామి గౌడ్ తదితరులు హాజరై నివాళులర్పించారు.

డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి కుటుంబానికి పరామర్శ

నవ తెలంగాణ-కొండపాక

డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి తల్లి లక్ష్మి దశదినకర్మ సోమవారం కొండపాకలో జరగడంతో పలువురు నాయకులు కార్యకర్తలు డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డిని పరామర్శించారు. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డితోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు లక్ష్మీ చిత్రపటానికి నివాళులర్పించారు.

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

తల్లిని డబ్బులు కావాలని అడగ్గా.. నిరాకరించడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీరాం నగర్‌కి చెందిన అంజి(22) అనే తన తల్లిని ఓ లక్ష రూపాయలు అడిగాడు. అందుకు ఆమె నిరాకరించడంతో అంజి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తన స్నేహితుడికి ఫోన్ చేసి తెలిపాడు. కాగా ఘటనా స్థలాన్ని బొల్లారం సిఐ నయీముద్దీన్ పరిశీలించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుక్క దాడిలో 18 గొర్రెలు మత్యువాత



నవతెలంగాణ-ఝరాసంగం

కుక్క దాడిలో 18 గొర్రెలు మత్యువాత పడిన ఘటన మండల పరిధిలోని గంగాపూర్ గ్రామంలో జరిగింది. మండల పశువైద్యాధికారి సునీల్ దత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గంగాపూర్ గ్రామంలో సోమవారం గొల్ల నర్సింలుకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. దీంతో అక్కడున్న 18 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. జీవనాధారంగా ఉన్న గొర్రెలన్నీ ఒకేసారి మృత్యువాత పడడంతో బాధితుడు కన్నీటిపర్యంతం అయ్యాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

మోడల్ సౌకర్యాలకు ఐఓసీ కార్యాలయం సిద్ధం

- మిషన్ భగీరథ డీఈపై ఆగ్రహం
- ఐఓసీ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో మోడల్ సౌకర్యాలతో ఆధునాతన పద్ధతిలో జనాలకు సేవలు అందించేందుకు కార్యాలయం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణానికి సమీపంలో సుమారు మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.17 కోట్ల నిర్మాణ వ్యయంతో అత్యంత అధునాతన పద్ధతిలో జరుగుతున్న ఐఓసీ నిర్మాణ పనులను ఆర్డీఓ బెన్ శాలేంతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండాలనే దృఢ సంకల్పంతో ఐఓసీ కార్యాలయ నిర్మాణం చేపట్టారన్నారు. ప్రజలకు ఒకే చోట అన్ని కార్యాలయాలతో సులభతరమైన సౌకర్యం అందించవచ్చని పేర్కొన్నారు. అందులో భాగంగానే హుస్నాబాద్ ఐఓసీ పనులు దాదాపు పూర్తికావచ్చాయని తెలిపారు. అతి త్వరలో మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రారంభిస్తారన్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో ఉన్న ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఇంజనీరింగ్ కార్యాలయాలు ఆర్ అండ్ బీ-పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, ఆటవీ రేంజ్ కార్యాలయం, ఎస్‌టిఓ కార్యాలయం, అగ్రికల్చర్, ఎక్సైజ్ అన్ని కార్యాలయాలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.. అలాగే టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, పార్కింగ్ అన్ని సదుపాయాలు ఒక కార్పొరేట్ స్థాయిలో కార్యాలయాలు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా అధికారులు డివిజన్ కార్యాలయాలన్ని ఐఓసి కి షిఫ్ట్ చేసి సిబ్బందితో సహా ఫైల్స్ ఇతరత్ర సామాగ్రి ఐఓసి ప్రారంభానికి ప్రజలకు సేవలు అందించేందుకు అన్ని విధాల సిద్ధం కావాలని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫర్నిచర్ మాత్రం ప్రతి కార్యాలయానికి అందిస్తామని, కార్యాలయంకు కావాల్సిన ఎలక్ట్రిసిటీ, వాటర్ ఫెసిలిటీ, మంచి రోడ్డు సౌకర్యం లైటింగ్ అన్ని పనులు పూర్తి కావొచ్చాయన్నారు. మిషన్ భగీరథ కనెక్షన్ పనులు మందకొడిగా సాగుతున్నందున డీఈని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటిండెంట్ శ్రీనివాస్ మూర్తి, డిటిఓ బాలరాజు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, డిపిఓ దేవకిదేవి, డిఎఓ శివప్రసాద్ పాల్గొన్నారు.



ఎంపీని భారీ మెజార్టీతో గెలిపిస్తాం



నవ తెలంగాణ రాయపోల్

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని రాబోయే శాసనసభ సాధారణ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపిస్తామని రాయపోల్ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే గులాబీ జెండా ఎగరాల్సిందేనని గత మూడు సంవత్సరాల నుండి నియోజకవర్గంలో ఏ అభివృద్ధి, ఏ పని జరిగిన నేనే చేశాను అంటూ బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని మూడు సంవత్సరాలలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గం మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే రాబోయే సాధారణ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు మీద అభాండాలు వేస్తూ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఇంకా ఎన్ని రోజులు మీ తండ్రి ముత్యం రెడ్డి పేరు చెప్పుకొని ఓట్లు అడుగుతారని మీరు నియోజకవర్గంలో చేసిందేమిటో చెప్పాలని, ఇప్పటికే దుబ్బాక ప్రజలు తిరస్కరించి ఓడించిన సంగతి మర్చిపోరాదన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యమకారులకు ఎప్పుడు అన్యాయం చేయలేదని సందర్భాన్ని బట్టి వివిధ పదవులు ఇచ్చి అందరికి న్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు.ముందు దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ తెచ్చుకున్న తర్వాత మీరు బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడాలని శ్రీనివాస్ రెడ్డికి హితవు పలికారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి గత రెండు పర్యాయాలు ఎంపీగా గెలుపొంది నియోజకవర్గంలో ప్రజల కష్టసుఖాలలో అండగా ఉంటూ అభివృద్ధిని,సంక్షేమ పథకాలను అమలు చేయడంలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రజల మధ్యనే ఉంటున్నారు. రాబోయే ఎన్నికలలో కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి దుబ్బాక నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కంచుకోటని నిరూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మౌనిక రాజిరెడ్డి, శోభారాణి, వెంకటరామిరెడ్డి, నాయకులు కల్లూరి శ్రీనివాస్, గణేష్, యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని హత్య చేసిన కేసులో నలుగురు రిమాండ్

నవతెలంగాణ దుబ్బాక రూరల్

కట్టుకున్న భార్యను కాదని పరాయి మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న తండ్రితో ఇటీవల కుమారులు ఘర్షణ పడ్డారు. తండ్రిని ఇనుప పైపుతో తండ్రిని బలంగా కొట్టి చంపిన ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో జరిగింది. మృతుడి భార్యతో పాటు ముగ్గురి కుమారులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు దుబ్బాక పోలీసులు తెలిపారు. దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చింతల తిరుపతి (50) ఆగస్టు 29న కొడుకులతో జరిగిన ఘర్షణలో నెట్టి వేయబడడంతో తలకు సిమెంటు దిమ్మె తగిలి చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. తిరుపతి శవపరీక్షలో తలపై బలమైన ఆయుధంతో కొట్టినట్లు గాయం ఉండడంతో మృతుడి కుమారుడు గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణలో గణేష్ నిజం ఒప్పుకున్నాడని తెలిపారు. మృతుని భార్యతో పాటు ముగ్గురు కుమారులను విచారించామన్నారు. విచారణలో తండ్రి వివాహేతర సంబంధం నేపథ్యంలో తమ కుటుంబంలో కొంతకాలంగా తీవ్రంగా గొడవలు జరుగుతున్నాయని, పరాయి మహిళతో వివాహేతర సంబంధం వద్దని ఎంత వారించిన తండ్రి వినలేదని చెప్పారని వివరించారు. ఆగస్టు 29న తండ్రి వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ దేవమ్మతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సిద్దిపేట శివారులోని రామచంద్ర నగర్ వద్ద చూసిన కుమారుడు అడ్డుకునే ప్రయత్నం చేశాడని తెలిపారు. దీంతో రగిలిపోయిన భార్య, కుమారులు, రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన తండ్రి తిరుపతితో తీవ్రంగా ఘర్షణ పడ్డారని తెలిపారు. తండ్రి ప్రవర్తనకు తీవ్రంగా విసుగు చెందిన మూడవ కుమారుడు గణేష్ ఇంట్లో ఉన్న ఇనుప పైపుతో తండ్రి తలపై వెనక బలంగా కొట్టాడని తెలిపారు. తండ్రి అక్కడికక్కడే కుప్పకూలాడన్నారు. అనంతరం భార్య ముగ్గురు కుమారులు, తలకు తీవ్ర గాయమైన తిరుపతిని ఆటోలో సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. వైద్యులు పరీక్షించి అప్పటికే తిరుపతి మృతి చెందాడని తెలిపారని వివరించారు. మృతుడి తమ్ముడు చింతల రాజలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి తిరుపతి మరణానికి కారకులైన అతడి భార్య ఐలవ్వ, ముగ్గురు కుమారులు భాస్కర్, గణేష్, శివాజీలపై ఐపీసీ 304 కింద హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ ఐ వి. గంగరాజు, కానిస్టేబుల్ బిక్షపతి తదితరులు ఉన్నారు.

సామాజిక పరివర్తన పాదయాత్రను విజయవంతం చేయాలి



నవ తెలంగాణ-సిద్దిపేట

డీబీఎఫ్, బామ్ సేఫ్, దళిత బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10 నుండి 29 వరకు సామాజిక పరివర్తన పాదయాత్రను దుబ్బాక నియోజకవర్గంలో చేపట్టడం జరుగుతుందని డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వినయ్ కుమార్ తెలిపారు. సోమవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, బామ్ సేఫ్ కేంద్ర కమిటి సభ్యులు డాక్టర్ కుమార్‌ల ఆధ్వర్యంలో పాదయాత్ర ఈ నెల 10న రాయపోల్ మండలం బేగంపేటలో ప్రారంభిస్తామని తెలిపారు. బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, హక్కులు, చట్టాలు, ఓటు హక్కు వంటి సామాజిక అంశాలు, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన, చైతన్యం కల్పించేందుకు సామాజిక పరివర్తన పాదయాత్ర దుబ్బాక నియోజకవర్గంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పాదయాత్ర ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ మల్లెపల్లి లక్ష్మయ్య ప్రారంభిస్తారని తెలిపారు. గ్రామాలలో ప్రజా సమస్యలు, రైతులు, కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళల సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాలలో అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల హాస్టలు సందర్శించి విద్యార్థుల సమస్యలను, సౌకర్యాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. సామాజిక పరివర్తన పాదయాత్ర దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలలో చేపట్టడం జరుగుతుందని, ఈ పాదయాత్రకు దళిత బహుజన, ప్రజా, కార్మిక , విద్యార్థి , జర్నలిస్టు , ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు అన్ని వర్గాల మద్దతిస్తూ, సహకారం అందించి, విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్, మంజీరా దళిత సేవ సమితి జిల్లా అధ్యక్షుడు పి.కిరణ్‌లు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు శ్రీనివాస్ పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన పరిగే శేఖర్ (29) ప్రమాదవశాత్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా... అదే గ్రామానికి చెందిన సంగేపు బాలయ్య (55) అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం పలువురి ద్వారా తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఇరువురి కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడొద్దు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కిషన్, యూత్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, బూత్ అధ్యక్షుడు నర్సింలు, దుబ్బాక అసెంబ్లీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఉషయ్య గారి రాజిరెడ్డి, విజయ్, తేజ, శ్రీను, మల్లేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం మృతిపై సంతాపం



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేటకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త తడకమడ్ల విశ్వం అకాల మరణం పట్ల మంత్రి హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. వ్యాపార వేత్తనే కాకుండా సేవా భావం సామాజిక సేవలో భాగస్వామ్యం అయ్యాడని, కరోనా సమయంలో ఎంతో మంది పేదలకు సేవ చేశారని మంత్రి కొనియాడారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

స్నేహితుడి కూతురు వివాహానికి పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల స్వరూప, కనకయ్య కుతూరు నిత్య వివాహానికి పుస్తె మట్టెలను బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, మ్యాకల కనకయ్య ఇచ్చారు. సోమవారం మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, కనకయ్యలు నూతన వధువుకు అందజేశారు. పాములపర్తి, పాతూరు బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షులు మహేష్,మల్లేశ్ ముదిరాజులు, చెక్కల నర్సింలు ,తదితరులున్నారు.

శ్రీశైలం దేవస్థానంలో నైనికవర్మ కళా ప్రదర్శన



నవ తెలంగాణ - సిద్దిపేట

శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా జరిగిన కళా వైభవంలో సిద్దిపేటకు చెందిన శ్రీ భవాని క్లాసికల్ డాన్స్ అకాడమీ గురువు డాక్టర్ జి.భవాని విజయ్ శిష్యురాలు నైనిక వర్మ కళా ప్రదర్శన ప్రదర్శించారు. దేవస్థానం ఈవో, నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

బాధితుడికి మొబైల్ ఫోన్ అప్పగింత



నవ తెలంగాణ-మిరు దొడ్డి

గత నాలుగు నెలల క్రితం మొబైల్ ఫోన్ పోవడంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోను కనుక్కొని బాధితుడికి మిరుదొడ్డి పోలీసులు అందజేశారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన తీపిరెడ్డి రాజు అల్వాల గ్రామం వద్ద తన మొబైల్ ఫోను బైక్ లో పెట్టి మర్చిపోవడం జరిగిందని తెలిపారు. తన పని ముగించుకొని బైక్ వద్దకు వచ్చి చూసేసరికి ఫోన్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నెంబర్‌ను బ్లాక్ చేసి ఉంచడం జరిగిందని ఎస్సై నరేష్ తెలిపారు. నాలుగు నెలల అనంతరం మొబైల్ ఫోన్లో నూతన సిమ్ వేయడంతో వెంటనే మెసేజ్ అలర్ట్ ద్వారా పోలీసులకు, బాధితుడికి సమాచారం రావడం జరిగిందని తెలిపారు. మొబైల్ ఫోను రికవరీ చేసి బాధితుడు రాజుకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ వెల్లడించారు. ఎవరైనా ఫోను పోగొట్టుకుంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏవైనా సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అపరిచిత వ్యక్తులు తక్కువ ధరకు సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను అమ్మితే తీసుకోవద్దని సూచించారు.

విశ్వం కుటుంబానికి చెరుకు పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక

అనారోగ్యంతో మరణించిన దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డుకు చెందిన ప్రముఖ వ్యాపార దిగ్గజం తడకమడ్ల విశ్వం భౌతిక ఖాయానికి సోమవారం కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. అనంతరం విశ్వం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటీవలే మరణించిన మండల పరిధిలోని రామక్కపేటకు చెందిన సంగేపు బాలయ్య, పరిగె శేఖర్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ దుబ్బాక అసెంబ్లీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గాజుల రమేష్ తండ్రి చంద్రయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తండ్రిని వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా చెఱకు శ్రీనివాస్ రెడ్డి వారికి మనోధైర్యాన్ని నింపి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌పేట భూంపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గజబింకర్ అశోక్, జనరల్ సెక్రటరీ కోనపురం బాలు, దుబ్బాక అసెంబ్లీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఉషయ్యగారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా చిగురుపల్లి జయకుమార్



నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ ఆంగ్లం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న చిగురుపల్లి జయకుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం చాలా హర్షనీయమని మండల విద్యాధికారి బండి నరసవ్వ అన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల అందజేత




నవ తెలంగాణ-సిద్దిపేట

జిల్లావ్యాప్తంగా 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని, వారందరికి మంగళవారం టీటీసీ భవన్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు పురస్కారాలు అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ కేటగిరీల నుంచి 50 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులు టీటీసీ భవన్‌లో జరుగు కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

'కళ' తప్పుతున్న గురుపూజోత్సవం

- వెట్టిచాకిరీకి గురవుతున్న ఉపాధ్యాయులు
- నిరంతరం అభద్రతాభావంతో పని
- అవార్డులు కాదు.. ఆత్మగౌరవం కావాలి



నవతెలంగాణ-సిద్దిపేట

సెప్టెంబరు నెల... సర్వేపల్లి రాధాకృష్ణ పండితుల జయంతి నాడు ఉపాధ్యాయులు గౌరవించే 'గురుపూజోత్సవం' జరుపుకుంటున్నాం. ఉపాధ్యాయులను, వారి సేవలను గుర్తు చేసుకుంటూ, సమాజ నిర్మాణంలో వారి పాత్ర గొప్పదని, సమాజమంతా గురువులను గౌరవించాలనే సందేశాలు వింటూ ఉంటాము. రాష్ట్రపతి మొదలుకొని ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, విద్యా మంత్రులు ఏదో ఒక సందర్భంలో ఉపాధ్యాయ వృత్తిని, ఉపాధ్యాయులను కీర్తిస్తూ ఉపన్యాసాలిస్తుంటారు. ఇంత వరకు బాగానే ఉంది! విద్యారంగమంటే ఉపాధ్యాయులు మాత్రమే కాదు! వారు పనిచేస్తున్న విద్యా సంస్థలు, వాటిని నిర్వహిస్తున్న ప్రభుత్వాలు, ఇంకా ప్రైవేటు యాజమాన్యాలు – వెరసి 'విద్యారంగం' అవుతుంది. మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో, విద్యా సంస్థలల్లో ఆర్థిక సంస్కరణల ప్రభావంతో ఉపాధ్యాయులకుండే గౌరవం, ఉన్నత స్థానం దిగజారింది. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలో తక్కువ వేతనాలకే ఉపాధ్యాయులు పనిచేసేలా పరిస్థితులు కల్పించారు. చివరకు కోవిడ్ సమయంలో పాఠశాలలు మూతబడి, యాజమాన్యాలు వేతనాల్వికపోవడంతో కూలిపని చేసే దౌర్భాగ్యం వచ్చింది. తక్కువ జీతంతో కుటుంబ పోషణ చేసికోలేక జీవితాలు చాలిస్తున్న వారెందరో! ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో విద్యారంగంలో ప్రైవేటు యాజమాన్యాల సంఖ్య పెరిగింది. విద్య వ్యాపారమైంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే వ్యాపారంగా విద్యా సంస్థల నిర్వహణ మారింది. ఫలితంగా యాజమాన్య, కార్మిక సంబంధాలుగా ఉపాధ్యాయుల బతుకులు మారాయి.

ఉపాధ్యాయులకు గౌరవమెక్కడ ?

ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) విద్యను వ్యాపార వస్తువుగా గుర్తించడంతోనే ఉపాధ్యాయుడు అమ్మకం దారుగా, విద్యార్థి కొనుగోలు దారుడుగా మారాడు. ఇక ఎంత మాత్రం విద్య సృజనాత్మక ప్రక్రియ కాదు. అది వ్యాపారం. ఎన్ని మార్కులు, ర్యాంకులు సృష్టించగలిగితే అంత డబ్బు! విద్యా ప్రమాణాలు, సమాజాభివృద్ధి, సామాజిక బాధ్యత అంతా తూచ్...! గౌరవం, గొప్పతనం అంతా వట్టిదే. "బోధన ఒక సృజనాత్మక ప్రక్రియ", "దేశ సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయుల భాగస్వామ్యం అభిలాషణీయమని" చెప్పిన కొఠారి కమిషన్ మాటలు ఇప్పుడు అప్రస్తుతమయ్యాయి. పెట్టుబడిదారుని మాటలే శిరోధార్యమయ్యాయి. అందుకే ప్రభుత్వం ఉపాధ్యాయుల పనిని గంటల రూపంలో కొలుస్తోంది.

ఉపాధ్యాయులను ఉత్తేజపరచడానికి బదులు వేధిస్తోంది. ఉపాధ్యాయులు తమ పని సృజనాత్మకమైనదని, తమ వృత్తి విశిష్టమైనదని మరచిపోతున్నారు. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న సంకటస్థితి!. నూతన విద్యా విధానం-2020 ఉపాధ్యాయులకు అటువంటి గౌరవాన్ని ఇచ్చే విధంగా రూపొందించలేదు. పని గంటలు, వేతనాలకు, సర్వీసు నిబంధనలకు, సీనియారిటీ ప్రకారం పదోన్నతులకు గ్యారంటీ ఇవ్వలేదు. నిరంతర అభద్రతతో పనిచేయాలి. పదవీ విరమణ తర్వాత భద్రత, రక్షణలేని విధంగా శేష జీవితం గడిపేలా కొత్త పెన్షన్ విధానం వచ్చింది. విద్యారంగానికి కేటాయించే నిధులు కుంచించుకుపోవడంతో, ఆ ప్రభావం నియామకాలపై పడింది. ఏటా నియామకాలు లేకపోవడంతో కొత్త తరాలకు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించే అవకాశంలేదు. ప్రతిభగల యువకులంతా ఇతర వృత్తులలోకి చేరిపోతున్నారు. "ఉపాధ్యాయ వృత్తిలోనికి ప్రతిభగల యువకులను ఆకర్షించాలంటే ఈ వృత్తికి సమాజంలోని ఇతర వర్గాల కన్నా మెరుగైన వేతన శ్రేణులుండాలని, అద్భుతమైన పదోన్నతి అవకాశాలుండాలని" అరవై ఏళ్ళనాడు కొఠారి కమీషన్ చెప్పింది. అప్పుడే ప్రతిభగల ఉపాధ్యాయులు వృత్తిలో చేరి, వారి బోధనతో నాణ్యమైన విద్యార్థులు తయారవుతారని వివరించారు. ఇప్పుడు శ్రమ దోపిడీ, వెట్టి చాకిరీతో ఉపాధ్యాయులు వృత్తిని నిర్వహిస్తున్నారు. పదోన్నతులు లేక ఏ స్థాయిలో ఉన్న ఉపాధ్యాయుడు అదే హోదాతో పదవీ విరమణ చెందుతున్నాడు. తనతో పనిచేసిన గుమాస్తానే జిల్లా విద్యాశాఖాధికారిగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. కాని "టీచరు టీచరుగానే రిటైరవడమే ఇప్పుడున్న గౌరవం!'.

'అందరికీ ఉచితంగా విద్యనందిస్తామని' ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటును ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ విద్యారంగాన్ని విధ్వంసం చేస్తోంది. విద్యారంగానికి నిధుల కేటాయింపులు లేకపోవడంతో తక్కువ వేతనాలతో నియామకాలు జరుపాల్సి వస్తోంది. ఉపాధ్యాయ నియామకాలు మరిచిపోయింది. ప్రాథమిక పాఠశాల నుండి విశ్వ విద్యాలయం వరకు ఉపాధ్యాయుల కొరత ఉంది. చివరకు ఉపాధ్యాయులను తయారు చేసే కళాశాలల్లో అధ్యాపకులు లేని పరిస్థితి ఉంది. ఉపాధ్యాయులన్నా, విద్యారంగమన్నా వారి సమస్యలన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోని నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. ఉపాధ్యాయులు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రభావ వర్గంగా లేరు. కనుక వీరిని పట్టించుకోవాల్సిన అవసరం లేదనే మనస్తత్వంతో ప్రభుత్వం ఉందని భావించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య, వారి జీతభత్యాలు, పెన్షన్లను తగ్గించి, ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించాలని గంగోపాధ్యాయ కమిటీ సూచనలకనుగుణంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలున్నాయి. అదే క్రమంలో విద్యారంగ ప్రైవేటీకరణపై కోనేరు రామకృష్ణారావు కమిటీ చేసిన సిఫార్సులననుసరించి విద్యారంగంలో ప్రభుత్వ పాత్ర తగ్గించింది, నాణ్యమైన విద్య అందించేలా ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలనే విధానాలను ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. అందుకే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోయి, మొత్తం విద్యార్థుల సంఖ్యలో 52శాతం మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారు. రెండేళ్ళుగా ఉన్నత విద్య, విశ్వవిద్యాలయాలతో సహా అనేక వైద్య, ఇంజనీరింగు కళాశాలలో, ఉన్నత విద్యనందించే విద్యా సంస్థలు ప్రైవేటు రంగంలో ప్రారంభమైనాయి. ఈ మార్పులన్ని ఉపాధ్యాయ వృత్తిని, గౌరవాన్ని దిగజార్చే విధంగా ఉంటున్నాయి.

ఆదర్శ యజమానిగా ఉండాల్సిన ప్రభుత్వమే పెద్ద ఎత్తున ఉపాధ్యాయులను తక్కువ వేతనాలకు నియమిస్తోంది. ఆర్భాటంగా ప్రారంభిస్తున్న గురుకులాలు, కళాశాలలల్లో గంటల ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు నియామకమవుతున్నారు. బాలికలకు విద్యనందించే కెజిబివి పాఠశాలలో సిబ్బంది అంతా అత్యంత తక్కువ వేతనాలకు వెట్టిచాకిరీ చేస్తున్నవారే! వీరి జాబ్ చార్ట్ ప్రకారం చూస్తే వీరు పొందుతున్న వేతనం అతి తక్కువ! పైగా కెజిబివి పాఠశాల ప్రిన్సిపాళ్ళకు ఆదర్శ కళాశాలల హాస్టళ్ళ నిర్వహణ కూడా అదనంగా ఇచ్చి, బెదిరింపులతో విధుల నిర్వహణ చేయిస్తోంది. ఇదీ మహిళా ఉపాధ్యాయులకిచ్చే గౌరవం? ఈ చర్యలన్ని ఉపాధ్యాయులకున్న గౌరవాన్ని, స్థాయిని దిగజార్చేవే! అత్యంత దీన స్థితిలో, దయనీయంగా ఉన్న ఉపాధ్యాయులకు ఉదాత్తమైన గౌరవం దక్కేనా? గురుపూజోత్సవ గౌరవమంటే ఇదేనా? ప్రభుత్వాధినేత తన గురువును వేదికలపై వంగి దండాలు పెట్టి సన్మానిస్తే సరిపోతుందా? ఎనిమిదేళ్ళ కాలంలో ఒక్కసారి కూడా రాష్ట్రంలో విద్య గురించి, విద్యారంగం గురించి, ఉపాధ్యాయుల సమస్యల గురించి చర్చించిన పాపాన పోలేదు. కనీసం వినతిపత్రం స్వీకరించి, ఉపాధ్యాయుల సమస్యలను ఆలకించి, పరిష్కరించే ధ్యాస, సోయి ఈ అధినేతకు లేకపోవడం శోచనీయం! ఉపాధ్యాయులకు ప్రభుత్వం పనికి తగ్గ వేతనం ఇవ్వాలి, పదోన్నతులు కల్పించి గౌరవించాలి, అవార్డులు కాదు ఆత్మగౌరవాన్ని కాపాడడం ముఖ్యం.

– జి తిరుపతిరెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, సిద్దిపేట

ఓట్ల పార్టీ కాంగ్రెస్..ప్రజల పార్టీ బీఆర్ఎస్

బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెసరి సాంబరాజు



నవతెలంగాణ-అక్కన్నపేట

కాంగ్రెస్ ఓట్ల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వస్తుందని, కానీ బీఆర్ఎస్ పేద ప్రజల కోసం ఎప్పుడు నిలుస్తుందని అక్కన్న పేట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెసరి సాంబరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని దేశవ్యాప్తంగా మేధావులు కొనియాడుతుంటే హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులకు కనబడడం లేదా అన్నారు. హుస్నాబాద్, అక్కన్న పేట అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. దేశంలో అత్యధిక సంవత్సరాలు పాలించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ఆ టైంలో మీరు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కేవలం రెండు పర్యాయాలు పాలించిన కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, ఎన్నో ప్రాజెక్టులు, 24 గంటల కరెంటు, పింఛన్లు ఇలా అనేక పథకాల ద్వారా పేద ప్రజలకు ఆసరాగా నిలుస్తుందని తెలియజేశారు. ఇన్ని చేస్తున్న ప్రభుత్వాన్ని వారు విమర్శించడం సిగ్గుచేటన్నారు. 1.06 టీఎంసీలతో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టు ను పూర్తి చేయడం చేతకాని కాంగ్రెస్, ప్రాజెక్టు గురించి మాట్లాడడం దారుణమన్నారు. 8 టీఎంసీలుగా ప్రాజెక్టును విస్తరించి మూడు సంవత్సరాలలో పూర్తి చేసిన ఘనత ఎమ్మెల్యే సతీష్ కుమార్ దని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి బీలు నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు యాస శ్రీను, యూత్ నాయకులు సంపత్, మల్లంపల్లి ఎంపీటీసీ శ్రీనివాస్, రామవరం ఎంపీటీసీ శ్రీనివాస్, కత్తుల శంకర్, సీనియర్ నాయకులు లింగాల సాయన్న, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే విడుదల చేయాలి

నవ తెలంగాణ కొమురవెల్లి

ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఆరుట్ల రవీందర్ డిమాండ్ చేశారు.తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సి ఐ టి యు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సూపరిండెంట్ రాంప్రసాద్ వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కార్మికులు జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా టోకెన్ సమ్మె చేసి నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వగానే విద్యాశాఖ మంత్రి ప్రెస్ మీట్ పెట్టి జూలై నుండి పెంచిన వేతనాలు ఇస్తామని ప్రకటించి ఇప్పటివరకు అది అమలు కావడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా పెంచిన వేతనాలకు అనుగుణంగా నిధులు విడుదల చేసి ఇవ్వాలని నెలల తరబడి వేతనాలు పెండింగ్ లో ఉండడం వలన అప్పులు చేసి వంట చేశామని బిల్లులు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే విడుదల చేయాలన్నారు, కోడిగుడ్లకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సబ్సిడీపై వంట గ్యాస్ ఇవ్వాలని కొత్త మెనూ ను సవరించాలని అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజన నిర్వహణను అప్పజెప్ప వద్దని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు బాలలక్ష్మి పద్మ రమేష్ పాల్గొన్నారు .



గురువులకు వందనం..

- జిల్లాలో 70 మంది ఉత్తమ ఉపాద్యాయ
- అవార్డులకు ఎంపిక
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-మెదక్

గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః అంటారు. గురువును ప్రత్యక్ష దైవంగా భావించి విద్య నేర్పిన గురువుల సేవలను గుర్తించి సత్కరిం చేందుకు ఏటా సెప్టెంబరు 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. జన్మనిచ్చి న తల్లిదండ్రుల తర్వాత అంతటి గౌరవం గురువు లకే దక్కింది. అజ్ఞానమనే చీకటిలో నుంచి విజ్ఞాన మనే వెలుతురు వైపు అడుగులు వేయించే గురువు లకు సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆదర్శప్రాయుడు, దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రతీ ఏడాది ఉపాద్యాయ దినోత్సవం నిర్వహిస్తారు.

70 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 70 మంది ఉపాధ్యాయులు ఉత్తమ పురస్కారాలను అందుకోబోతున్నారు. ఇందులో ఇద్దరు ఉన్నత పాఠశాల హెచ్ఎంలు, 36 మంది ఎస్జీటీలు, తెలుగు పండిట్ లు 6 మంది, హిందీ పండిత్ 2, ఇంగ్లీష్ 4, మాథ్స్ 5, ఫిజికల్ సైన్స్ 4, బయలాజికల్ సైన్స్ 3, సోషల్ 3, పీఈటి 2 ఎంపికయ్యారు. అలాగే స్పెషల్ అవార్డ్సులో మోడల్ స్కూల్ లో టిజిటి మ్యాథ్స్, ఫిజిక్స్ పిజీటి, కేజీబివి సీఆర్టి తెలుగు ఉపాద్యాయులు అవార్డులు అందుకోనున్నారు.

నేడు కలెక్టరేట్లో వేడుకలు:

జిల్లాస్థాయి గురుపూజోత్సవ వేడుకలను మంగళవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ రాజర్షి షా సమక్షంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హాజరుకానున్నారు. అవార్డు గ్రహీతలంతా నిర్ణీత సమయానికి హాజరు కావాలని డీఈవో రాధాకృష్ణ తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కరానికి చర్యలు చేపట్టాలి

ప్రజావాణికి 40 దరఖాస్తులు



నవతెలంగాణ - మెదక్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్న అర్జీలను పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన 40 దరఖాస్తులు స్వీకరించారు. అందులో 38 ధరణి, 02 గృహలక్ష్మి దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ సమస్యలకు సంబంధించి వస్తున్న వినతుల పై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే ఫిర్యాదులను అక్కడే పరిష్కరిస్తే జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదని, దీనివల్ల బాధిత ప్రజల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఫిర్యాదీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చూడాలని, లేనిపక్షంలో తగు పరిష్కార మార్గాలు చూపాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

సంగారెడ్డి

మంగళవారం | 05 సెప్టెంబర్ 2023 | www.navatelangana.com

ప్రణాళికా బద్ధంగా నిధుల కేటాయింపు



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధి లోని భాష్యం స్కూల్ సమీపంలో రూ.42 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న యూజీడీ పనులు, కుమ్మరి బస్తీ లో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమా ర్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పిటిసి మాణిక్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లవేళలా కృషి చేస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మైత్రిహిల్ వ్యూ కాలనీలో మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. కాలనీలోని ప్రధాన సమస్యలైన తాగునీరు, రోడ్లు, డ్రయినేజీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత బాచుపల్లి జైపాల్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆపత్కాల సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండగూడకు చెందిన బాయమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తోంది. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసిని బాయమ్మ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సోమవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజు, వెంకటేష్ గౌడ్, వంగరి అశోక్, భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లో చేరిన యవకులు..

పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన 40 మంది యువకులు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పాండు, రుద్రారం గ్రామ సర్పంచ్ సుధీర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, వీర కుమార్, యువకులు పాల్గొన్నారు.

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో కాట శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమీన్‌పూర్ గ్రామంలో జరిగిన బద్ది పోచమ్మ-మారెమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతష్ఠా మహోత్సవంలో పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రమేష్, మాజీ వార్డ్ మెంబెర్ రవీందర్, ఆశగారి లక్ష్మణ్, ఎన్ నరసింహ, కుమార్, ఆశయ్య, సత్తయ్య, శ్రీరాములు, శ్రీను, కేశవులు, మహేష్, సురేష్, శివ, రాము, మల్లేష్, లక్ష్మణ్, రాజు, వీరయ్య,నరసింహ, యాదగిరి, వెంకటేష్, నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న వై.నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం రంజోల్ శిల్ప బృందావన్ వెంచర్‌లో సోమవారం జరిగిన న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామం పట్లోల కిష్టారెడ్డి నూతన గృహప్రవేశ వేడుకలో బీఆర్ఎస్ నాయకులు వై.నరోత్తం పాల్గొని.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శికారి గోపాల్, చెంగల్ జైపాల్, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి బోనాల పండుగలో కాట సుధారాణి



నవతెలంగాణ-గుమ్మడిదల

శ్రావణమాసం సందర్భంగా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో ఘనంగా నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి పాల్గొని.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేసి ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బేకు నీలమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, ఎంపీటీసీలు గోవర్ధన్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ రేణుక, గ్రామ అధ్యక్షుడు అంజద్, మైపాల్ రెడ్డి, అజర్, మాజీ అధ్యక్షుడు వెంకటేష్, పోచయ్య, శంకరయ్య, యాదయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలకు ప్రభుత్వం అండ



నవతెలంగాణ-రాయికోడ్

గొల్ల కురుమలకు ప్రభుత్వం అండగా ఉన్నదని ఎంపీపీ మమత అశోక్, మాజీ డీసీఎంఎస్ చైర్మెన్ సిద్ధాన్న పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాయికోడ్ గ్రామానికి చెందిన గొల్ల కురమలకు 12 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసినట్టు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సహకారంతో గొల్ల కురుమలకు జీవాల పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ విట్టల్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, వరం వైస్ చైర్మన్ తుకారం, గ్రామ ఉపసర్పంచ్ రామకృష్ణ, పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లేశం ,యువత అధ్యక్షులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న వానలు



నవతెలంగాణ-ఝరాసంగం

గత రెండు నెలలుగా వర్షాలు ముఖం చాటేయడంతో.. ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, సోయా, మొక్కజొన్న తదితర పంటలు ఎండుతు న్నాయి. తాజాగా రెండు రోజుల నుండి మండల వ్యాప్తంగా వానలు దంచి కొడుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఝరాసంగం మండలంలో ఈనెల 03వ తేదీన 8.4 ఎమ్ఎమ్, సోమవారం 53.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో పత్తి, సోయా, మొక్కజొన్న పంటలలో నీరు నిల్వ చేరింది.


దుండగులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-హత్నూర

మేకలు దొంగలించారనే నెపంతో మేకల కాపరి తేజ అతడి స్నేహితుడు చిలుముల కిరణ్ అనే దళితుడిని కొందరు దుండగులు చెట్టుకు కట్టేసి.. కింద పొగ పెట్టి చిత్ర హింసలు పెట్టారని.. ఆ దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దళిత రత్న సాయమోళ్ల నర్సింగ్ రాజ్ డిమాండ్ చేశారు. ఒకవేళ దొంగతనం జరిగితే చట్ట ప్రకారం పోలీస్‌స్టే షన్‌లో ఫిర్యాదు చేయాలని గానీ.. ఇలా చిత్రహింసలు పెట్టడం సరికాదన్నారు. మేక ఖరీదు రూ.3వేలు ఇస్తామని కిరణ్, తేజ తల్లీదండ్రులు చెప్పినప్పటికీ.. వినకుండా దాడి చేయడంతో.. అవమానం భరించలేక కిరణ్ ఎవరికీ చెప్పకుండా పారి పోయాడన్నారు. కాబట్టి వెంటనే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి.. కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని.. లేని యెడల బాధితులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వర్షం పడితే.. రాకపోకలు బంద్



నవతెలంగాణ-న్యాల్‌కల్

గత నెలరోజులుగా వర్షపు జాడ లేక పంటలు ఎండిపో తుండగా.. ఆదివారం రాత్రి నుంచి ఒక్కసారిగా కురిసిన వానలు రైతన్నకు సంతోషాన్ని ఇచ్చాయి. ఎండిపోయే పంటలకు జీవం వస్తుందని అన్నదాతలు సంబుర పడుతున్నారు. అయితే మరోపక్క చిన్నపాటి వర్షానికి సైతం అంతరాయం కలిగిస్తున్న రోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని మెటల్‌కుంట - బసంతపూర్ వెళ్లే రోడ్డు వంతెన పైనుంచి వర్షం నీరు పారుతుండడంతో.. బసంత్ పూర్, కల్‌బేమల్ గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోతున్నాయి. వర్షం పడిదంటే చాలు.. ఈ తిప్పలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. వంతెన ఎత్తుభాగం పెంచి నిర్మించాలని కోరుతున్నారు.

ఉసికే బావి కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన

- రూ.2 కోట్లు కేటాయింపు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-అమీన్‌పూర్

దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉసికే బావి కల్వర్టు నిర్మాణ పనులకు శాశ్వత పరిష్కారంగా రెండు కోట్ల రూపాయలు కేటాయించడంతోపాటు, శరవేగంగా పనులు పూర్తి చేస్తామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య కాలనీ, గ్రీన్ మెడోస్, గ్రీన్ ఫీల్డ్ కాలనీల్లో రెండు కోట్ల 95 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14వ వార్డు పరిధిలోని ఉసికే బావి నుండి రామచంద్రాపురం డివిజన్ నుండి జాతీయ రహదారికి అనుసంధానం చేసే విధంగా శాశ్వత ప్రాతిపదికన రెండు కోట్ల రూపాయలతో నూతన కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సుమారు 30 కాలనీలకు పైగా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. మున్సిపల్ నిధులతోపాటు ప్రత్యేక నిధుల ద్వారా అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తెలిపారు. సీసీ రోడ్లు అంతర్గత మురుగునీటి కాలువలతో పాటు పార్కులు చెరువులను సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు కవిత శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, చంద్రకళ గోపాల్, బాలమణి బాలరాజు, ప్రమోద్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు యూనూస్, బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ తులసిరెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతు సంఘం శిక్షణా తరగతులు వాయిదా



నవతెలంగాణ-సంగారెడ్డి

అకాల వర్షాల కారణంగా రైతు సంఘం శిక్షణా తరగతులు వాయిదా వేసినట్టు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే. రాజయ్య తెలిపారు. స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో తెలంగాణ రైతు సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కే.రాజయ్య మాట్లాడుతూ.. కొండాపూర్‌లో ఈనెల 4, 5 తేదీల్లో జరిగే తెలంగాణ రైతు సంఘం జిల్లా శిక్షణ తరగతులు అకాల వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు చెప్పారు. గత నెల రోజుల నుండి వర్షాలు పడకపో వడంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతుల వ్యవసా య పనుల్లో ఉంటారని.. కాబట్టి ఈ సమావేశాలు వాయిదా వేసినట్టు తెలిపారు. తిరిగి ఈ శిక్షణ తరగతులు ఈనెల 15వ తేదీ కొండాపూర్‌లో జరుగుతాయన్నారు. ఈ సమావే శంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, యాదవ రెడ్డి, జిల్లా నాయకులు దేవయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'హోప్ కార్డియోలో' అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

- 3డి- రేడియో ఫ్రీక్వెన్సీ అబేషన్ సర్జరీ సక్సెస్..



నవతెలంగాణ-సంగారెడ్డి

హోప్ కార్డియోలో ఆసుపత్రిలో అత్యంత అరుదైన శస్త్రచికిత్స 3డి- రేడియో ఫ్రీక్వెన్సీ అబేషన్ సర్జరీ విజయవంతం అయ్యిందని హోప్ కార్డియోలో ఆసుపత్రి డాక్టర్ అనిల్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల సంగమేశ్వర్ చౌహాన్ అనే యువకుడు గుండె దడతో బాధపడుతూ హోప్ కార్డియోలో ఆసుపత్రి వచ్చాడు. పరీక్షల తర్వాత అతనికి వెంట్రిక్యులర్ బిజెమిని ఉన్నట్లు నిర్ధారణ అయింది. బీటా బ్లాకర్ల తర్వాత కుడా వీపీసీ భారం ఎక్కువగా ఉంది. హోల్టర్ మానిటరింగ్‌లో ఈ సమస్యకు రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ -3డితో పరిష్కారం ఉంటుంది. సాధారణంగా ఈ ప్రక్రియ హైదరాబాద్‌లాంటి పెద్ద నగరాల్లో ఉన్న ఆసుపత్రిలో జరుగుతుంటుంది. అయితే హోప్ కార్డియోలో డాక్టర్ అనిల్ బృందం ఎలక్ట్రో ఫిజియాలజిస్ట్ డాక్టర్ సాయి కిరణ్ మద్దతుతో ఈ ప్రక్రియను విజయవంతంగా చేశారు. ప్రక్రియ తర్వాత సంగేశ్వర్ ఎలాంటి దడ సమస్యలు లేకుండా బాగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా ప్రజలకు ఇంత సంక్లిష్టమైన వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉన్నదని డా.అనిల్ తెలిపారు.

భగీరథ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

మిషన్ భగీరథ కార్మికులకు 6 నెలల బకాయి జీతాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఈఈ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మిషన్ భగీరథ డీఈ రాకేష్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని న్యాల్కల్ మండల పరిధిలో గల రాఘవపూర్ పంప్ హౌస్ లో పని చేస్తున్న జీకేఆర్ సంస్థ కార్మికుల వేతనాలను 6 నెలల నుంచి చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదు ర్కొ ంటున్నారన్నారు. వేతనాలు చెల్లించాలని అడిడితే కాంట్రాక్టర్, మిషన్ భగీరథ అధికారులు రేపు మాపు అంటు న్నారే తప్ప చెల్లించడం లేదన్నారు. కార్మికులకు జీతాలు రాకపోవడంతో పిల్లల స్కూలు ఫీజులు కూడా చెల్లించలేకపో తున్నారని.. దీంతో ఆ పిల్లలను స్కూలు నుంచి పంపిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని.. లేని యెడల ఈనెల 11 నుంచి నీటి సరఫరా బంద్ చేసి.. పంపుహౌజ్ వద్ద పోరాటం చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో కార్మికులు రాములు, సుధాకర్, బిచ్చయ్య నర్సింలు, హాజీ, ప్రభాకర్, కృష్ణ, శ్రీనివాస్, మాణి క్యం, వీరారెడ్డి, నర్సింలు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల ఆవేదన

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జాతీయ రహదారిపై నిరసన

- ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం



నవతెలంగాణ-గుమ్మడిదల

బస్సులు సరిపోక.. వచ్చే బస్సులు ప్రయాణ ప్రాంగణాల్లో ఆపకపోవడంతో పాఠశాలకు, కళాశాలకు వెళ్లడానికి మండల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మండలంలోని అన్నారం గ్రామ జాతీయ రహదారిపై విద్యార్థులందరూ కలిసి నిరసన చేపట్టారు. ఒకవైపు వర్షం ఏకధాటిగా వస్తున్నప్పటికీ లెక్కచేయకుండా ఆర్టీసీ బస్సులను ఆపి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాటాడుతూ.. మండలంలోని నల్లవల్లి గ్రామం నుంచి అన్నారం గ్రామం వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 9 వరకు వందల సంఖ్యలో విద్యార్థులు హైదరాబాద్ లోని పలు కళాశాలలకు వెళ్తుంటామన్నారు. కానీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడం.. వచ్చే అతి తక్కువ బస్సులు కూడా ప్రయాణ ప్రాంగణాల్లో ఆపకుండా వెళ్తుండడంతో.. తాము కళాశాలకు వెళ్లలేకోపతున్నామని వాపోయారు. ఇప్పటికే ఈ విషయాన్ని చాలాసార్లు స్థానిక ప్రజా ప్రతినిధులు డిపో మేనేజర్ల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ.. సమస్యకు పరిష్కారం చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికా రులు, ప్రజా ప్రతినిధు లు.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బస్సులను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మండల వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కా ర్యక్రమం లో ఏబీవీపీ జిల్లా సభ్యులు ఉదయ్‌సాగర్, మణి కంఠ, కార్తిక్, శైలిని, అఖిల్,బాబు, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన



నవతెలంగాణ-కంది

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మండలంలోని కాశిపూర్ గ్రామంలో కరపత్రాలు పంచుతూ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు పి.అశోక్ మాట్లాడుతూ.. నిత్యవసర వస్తువుల ధరలు పెంచి మోడీ ప్రభుత్వం పేద ప్రజల నడ్డి విరుస్తున్నదన్నారు. పేదల సంక్షేమాన్ని మరిచి పెట్టుబడిదరులకు మేలు చేస్తున్నదన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలన్నారు. సిలిండర్ పై రూ.200 తగ్గింపు చేయడం కేవలం ఎన్నికల స్టంటేనన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి.. నేటికీ ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేటర్ పక్షాన ఉంటూ.. వారికే రాయితీలు ఇస్తూ.. ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి, నాయకులు కుమార్ ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- నూతన పెన్షన్ ప్రొసీడింగ్స్ పత్రాల పంపిణీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

సమాజంలో అత్యంత వివక్షతకు, అపహాస్యాలకు గురవుతున్న వికలాంగుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు రూ.500 పెన్షన్‌ను నాలుగు వేల రూపాయలకు పెంచిన మహోన్నత నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో సోమవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి వికలాంగుల పెన్షన్ లబ్దిదారుల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం కేసీఆర్ ఇటీవల పెంచిన పెన్షన్ ప్రొసీడింగ్ పత్రాలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన దివ్యంగుల సంక్షేమానికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన విజనరీ లీడర్ సీఎం కేసీఆర్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా వికలాంగులకు 4016 రూపాయల పెన్షన్ అందిస్తూ సీఎం కేసీఆర్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు.తాము అధికారంలోకి వస్తే అది చేస్తాం ఇది చేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ప్రగల్భాలు పలుకుతున్న ప్రతిపక్ష పార్టీలకు చెంప చెల్లుమంలా వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని దివ్యాం గులకు సొంత నిధులతో సుమారు 300కు పైగా స్కూటీలను పంచి వారి సంక్షేమానికి కృషి చేశామని గుర్తు చేశారు. భవిష్య త్తులోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ తగు ప్రాధాన్యత అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవానందం, ప్రవీణ విజయ భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, సుప్రజా వెంకట్ రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు లలితా సోమిరెడ్డి, రోజా బాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, సింధుఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెగిన సింగూరు ఎడమ కాలువ

- పెద్ద చెరువులోకి వచ్చి చేరుతున్న నీరు..
- ఇప్పటికే నిండుకుండలా చెరువు
- ఏ క్షణమైనా తెగిపోవచ్చని గ్రామస్తుల ఆందోళన
- ఎడమ కాలువ నీటిని వదిలి.. తెగిపోయిన కాలువకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-పుల్కల్

గత రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. అయితే ఇప్పటికే సింగూరులో నీరు సమృద్ధిగా ఉండడంతో ఎడమ కాలువ ద్వారా సాగుకు నీటిని వదులుతున్నారు. అయితే ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో నీటి ఉధృతి పెరిగి.. పుల్కల్ మండల పరిధిలోని సోంపేట గ్రామ శివారులోని సింగూరు పెద్ద కాలువ ఒక్కసారిగా తెగిపో యింది. దీంతో నీరంతా గ్రామ పెద్ద చెరువులోకి చేరుతున్నది. ఇప్పటికే ఆ చెరువు నిండుకుండలా ఉన్నదని.. నీటి ఉధృతి ఇలాగే ఉంటే ఎ క్షణమైనా తెగిపోయే ప్రమాద మున్నదని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చెరు వు తెగిపోతే వందల ఎకరాల వరిపంట కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నదని వాపోతున్నారు. కావున వెంటనే ఇరిగే షన్ శాఖ అధికారులు సింగూరు ఎడమ కాలువ ద్వారా వదిలిని నీటిని నిలిపి.. తెగిపోయిన కాలువకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నీలం.. నీ వెంటే మేమంతా

- రోజు రోజుకు బలపడుతున్న బీసీ వాదం
- తాజాగా మద్దతు ప్రకటించిన రామేశ్వరం బండ, గుమ్మడిదల గ్రామాల సబ్బండ వర్గాలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

బహుజన నాయకుడు, బీసీ బిడ్డ నీలం మధు వెంటే మేమంతా ఉంటామంటూ గ్రామాల్లోని సబ్బండ వర్గాలు ముందుకు వస్తున్నాయి. సామాజిక న్యాయం నినాదంతో అన్ని సబ్బండవర్గాలు ఏకమవుతున్నాయి. గత నాలుగేండ్లుగా అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నీలం మధు సేవలు పటాన్‌చెరు నియోజకవర్గానికి అవసరమని వారు గుర్తు చేస్తున్నారు. పార్టీల టికెట్లను పక్కనపెట్టి ఈసారి సబ్బండ వర్గాల తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాల్సిందే అంటూ ఘంటాపథంగా కోరుతున్నారు. తాజాగా పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ, గుమ్మడిదల గ్రామాల కుల సంఘాలకు సంబంధించిన నాయకులు, గ్రామస్తులు నీలం మధును కలిసి తమ మద్దతును తెలిపారు. వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గానైనా పోటీ చేయాలని కోరారు. పార్టీలకతీతంగా నీలం మధు ముదిరాజ్ కి మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. తన మీద ఉన్న అభిమానంతో తనకు ఏకగ్రీవంగా సంపూర్ణ మద్దతు ప్రకటించిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా బీసీ సబండవర్గాల ప్రజలు ఏకం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఖచ్చితంగా అందరితో చర్చించి పటాన్ చెరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని.. త్వరలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల నాయకులు నర్సింలు, మత్స శాఖా అధ్యక్షులు ఆంజనే యులు, ధనంజయ్, యాదకిషన్, పాండు, కృష్ణ, పోచయ్య, సుభాష్, శ్రీశైలం, నాగయ్య, రామేశ్వరంబండ నాయకులు మన్నే ఆంజనేయులు,సురేష్, బిక్షపతి, రవి,ప్రవీణ్, విష్ణు, జనార్ధన్, నాగరాజు, హరీష్ గౌడ్,శ్రీనివాస్, అశోక్, మహేష్, శివ శంకర్, గోవర్ధన్, దినేష్, విక్రమ్ గౌడ్, నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.



ఏఎన్ఎంల సమ్మె తాత్కాలికంగా విరమణ

నవతెలంగాణ-సంగారెడ్డి

ఏఎన్ఎంల సమ్మెను తాత్కాలికంగా విరమించి తిరిగి విధుల్లో చేరుతున్నట్టు సీఐటీయూ ఆధ్వర్యంలో డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో ఏవో ఎం. శ్రీవాణికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తు న్న యూపీహెచ్‌సీ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు సమస్యల పరిష్కారానికి గత నెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లారన్నారు. అయితే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కమిటీ వేస్తామని వేస్తామని చెప్పడంతో.. ఏఎన్ఎంలు సమ్మెను తాత్కాలికంగా విరమించి తిరిగి విధుల్లో చేరాలని నిర్ణయించారన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించని యెడల తిరిగి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమ ంలో యూనియన్ నాయకులు మాధవి, శ్యామల, రాధా, విజయ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు త్వరలోనే ఇండ్ల స్థలాలు



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

త్వరలోనే పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు అవుతాయని గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశం చారి అన్నారు. ఇల్లు లేని సుమారు 300 మంది గ్రామ పంచాయతీ ప్రజలకు స్థల సేకరణ కోసం అల్లినగర్‌లోని 79 సర్వే నెంబర్‌లో ప్లాట్లను కేటాయించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారికి లిస్టును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఓ ఉపాధ్యాయ మేధావుల్లారా!

ఓ ఉపాధ్యాయ మేధావుల్లారా!
ఓ ఉపాధ్యాయ మేధావుల్లారా!
తరిగిపోతున్న దేశ భవిష్యత్తును
తరగతి గదిలో నిర్మించు..
కరిగిపోతున్న విద్యా విలువలను
విద్యార్థి మదిలో వెలిగించు..
అక్షరాన్ని ఆయుధాన్ని చేసి
ప్రతి హృదయాన్ని కదిలించే
అజ్ఞానపు అరల మీద
విజ్ఞానపు యజ్ఞం సాధించు..
పాఠ్యఅంశమే కాదు పరిమితి
ప్రజ్ఞ జ్యోతులను వెలిగించు..
ఆశయాలను పునాది చేసి
లక్ష్యాల భవనం నిర్మించు..
విధి కారాదు కేవలం విద్యా బోధన
జిరగాలి మానవతా విలువల సాధన
సహనానికి ప్రతీకగా
సమానత్వానికి భూమికగా
సాధించు సమైక్యతను
తొలగించు అనైక్యతను
కులాన్ని ఏ కంటితో చూడక
మతాన్ని నీ మనసులో దాచక
ఏక తాటిపై భారతీయతను బోధించు
భావి భారత పౌరులను తీర్చిదిద్దు
ఓ ఉపాధ్యాయ మేధావుల్లారా
ఇంకో మేధావిని సృష్టించేందుకు
జీవితాంతం శ్రమించు...

- అనుముల రాంచందర్
టీటీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి
నవతెలంగాణ-సంగారెడ్డి

